ప్రజాశక్తి

సోమవారం 29 సెప్టెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఉద్యోగాలా..ఎక్కడ.?

- డీఎస్సీలో ఇచ్చినవే స్పష్టం
- జిల్లాలో కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా రాని వైనం
- సాఫ్ట్‌వేర్ సంక్షోభం, ట్రంప్ సుంకాలతో అమెరికా ఆశలూ గల్లంతు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక 4.75 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు సిఎం చంద్రబాబు ప్రకటించారు. వీటిని జిల్లాల వారీగా పంచుకున్నా జిల్లాకు 20 వేల మందికి ఉద్యోగాలు వచ్చినట్లు భావించాలి. జిల్లాలో డిఎస్సీ ద్వారా చేపట్టిన నియామకాలే స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇవి 650 పోస్టుల వరకూ ఉన్నాయి. ఈ తరుణంలో వేలాది ఉద్యోగాలు ఎవరు ఇచ్చారు? ఎక్కడ లభించాయన్నదే ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం మారాక చిన్నచిన్న ఉద్యోగులను, కాంట్రాక్టు కార్మికులను పీకేసి తమ విధేయులను పాలకపక్షం పెట్టుకుంది. వీటన్నింటినీ లెక్కల్లోకి వేసుకున్నా ఆ సంఖ్య కనిపించడం లేదు. సబ్‌స్టేషన్లు కొత్తగా కొన్ని మంజూరు చేశారు. ఇవి ఇంకా పూర్తి కావాల్సి ఉంది. నియామకాలు జరగాల్సి ఉంది. ఉద్యోగాల కోసం ఎమ్మెల్యేలకు భారీగా వినతులు వస్తున్నాయి. హోం గార్డు పోస్టులకు సిఫార్సు చేయాలంటూ యువకులు చాలా మంది ఎమ్మెల్యేలను విన్నవించారు. ఆ నియామకాలు కూడా జరక్క చాలా మంది ఎదురుచూస్తున్నారు. కొత్తగా ఏమీ ఉద్యోగాలు పుట్టడం లేదు. ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేయడం లేదు. అనేక శాఖల్లో రిటైర్‌మెంటు అయ్యేవాళ్ల స్థానంలో కొత్తగా ఎవర్నీ తీసుకోవడం లేదు. ఇక సాఫ్ట్‌వేర్ రంగంలో సంక్షోభఛాయలు తగ్గలేదు. ట్రంపు సుంకాలతో ఇప్పుడు ఎగుమతులపైనే కాకుండా అమెరికా వెళ్లి ఉన్నత చదువులు అభ్యసించే వారికీ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. అమెరికా ఆశలు గల్లంతయ్యాయి. లక్షలాది రూపాయాలు అప్పులు చేసి విదేశీ చదువుల కోసం పోయే విద్యార్థుల సంఖ్య సగానికి సగం తగ్గింది. ఉపాధిపైనే ఆందోళన పెరిగింది. ఇక్కడా ఉద్యోగాలు లేక యువత ఖాళీగా ఉంది. వీరికి ▶ 2లో

లంక గ్రామాలను

చుట్టుముట్టిన వరద నీరు

- కృష్ణానది ప్రవాహపు రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్

వరద నీటిలో మునిగిన అరటి తోటలు

ప్రజాశక్తి-కొల్లూరు, బాపట్ల జిల్లా

ఎగువనున్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాల ప్రభావంతో కృష్ణా నదికి వరద వచ్చింది. అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆదివారం కృష్ణానది వరద ఉధృతి 6 లక్షలా 50 వేల క్యూసెక్కుల పైగా రావడంతో నదీ పరివాహక ప్రాంతంలో లోతట్టులో ఉన్న ఇటుక బట్టీలు, కంద, అరటి తోటలు వరదనీటిలో మునిగాయి. లంక గ్రామాల్లో సహాయక చర్యల కోసం ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కొల్లూరు మండలం, కృష్ణా నది నీటి ప్రవాహంతో ముంపు ప్రమాదం ఉన్న తోకలవారి పాలెం, పోతర్లంక, గాజుల్లంక, ఆవుల వారి పాలెం గ్రామాల పరిధిలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం అధికారులు, సర్పంచ్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎగువన కురుస్తున్న వర్షాల ప్రభావంతో కృష్ణా నదికి అధికంగా వరద నీరు వస్తోందన్నారు. ఈ మేరకు ముంపు గ్రామాల్లో ఉన్న ప్రజలందరినీ అప్రమత్తం చేశామన్నారు. కొల్లూరు మండలంలో వరద ప్రవాహం ముప్పు ఉన్న గ్రామాలలో అన్ని రకాల సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో రీహెబిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అధికారులు ప్రజలు అప్రమత్తంగా ▶ 2లో

వరద పరిస్థితులను కలెక్టర్ వినోద్ కుమార్‌కు వివరిస్తున్న తోకలవానిపాలెం గ్రామ సర్పంచ్ కృష్ణమోహన్

కార్మిక హక్కులు హరిస్తే..

ఐక్యంగా పోరాడతాం..

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు ఉమామహేశ్వరరావు, ధనలక్ష్మి
- జిల్లా కమిటీ ఎన్నిక

ఎన్నికైన సిఐటియు జిల్లా నూతన కమిటీ

ప్రజాశక్తి-రేపల్లె

పెట్టుబడిదారుల కోసం కార్మికుల హక్కులు హరిస్తే.. కార్మికులతో కలిసి.. ఐక్యంగా పోరాటాలు చేస్తామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కే.ఉమామహేశ్వరరావు, కే.ధనలక్ష్మి అన్నారు. ఆదివారం సిఐటియు జిల్లా మహాసభల్లో నూతన జిల్లా కమిటీ 31 మందితో కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఎం.వసంతరావు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.మజుందార్ ఎన్నికయ్యారు. రేపల్లె పట్టణంలో శ్రీ శుభంకర ఎలైట్‌లో కామ్రేడ్ జంగం.శామ్యూల్ నగర్, కామ్రేడ్ వాకా.సాంబశివరావు ప్రాంగణంలో జరిగిన ఈ మహాసభల్లో భాగంగా మొదట సిఐటియు జెండాను ఆవిష్కరించారు. మహాసభకు అధ్యక్షవర్గంగా సిహెచ్. మణిలాల్, ఎం.వసంతరావు, కే.ఝాన్సీ వ్యవహరించారు. మహాసభలో ముందుగా జిల్లావ్యాప్తంగా 3 సంవత్సరాల కాలంలో జరిగిన కార్యక్రమాలు చర్చించడం జరిగింది. అనంతరం సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కే.ధనలక్ష్మి, కే.ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ జిల్లాలో కార్మికులకు ఎదుర్కొంటున్న సమస్యలు అధ్యయనం చేసి పోరాటాలు రూపొందించాలని అన్నారు.

జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వసంతరావు, మజుందర్

కార్మిక వర్గాన్ని ప్రాంతాలు, కులాలు, మతాల పేరుతో చీలుస్తున్నారని, నూతన ఆర్థిక సంస్కరణలు అనంతరం పెట్టుబడిదారులు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని కార్మికులంతా ఐక్యంగా శ్రమకు తగిన వేతనాల కోసం ఐక్య పోరాటాలకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు కార్మికుల హక్కులు హరించటంలో ముందంజలో ఉన్నాయన్నారు. కార్మిక హక్కులు హరించే విధానాల మీద ఐక్య పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. మహాసభలకు ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు మోపిదేవి. శ్రీనివాసరావు, అధ్యక్షులు కే.సాయిప్రసాద్, మహాసభలో పలువురు ▶ 2లో

'డీఎస్సీ' ఉపాధ్యాయులకు

3 నుంచి శిక్షణ

- ఉమ్మడి ప్రకాశంలో 4 కేంద్రాల్లో నిర్వహణ
- 13 నుంచి పోస్టింగ్స్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

డీఎస్సీ 2025 ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఎంపికయిన ఉపాధ్యాయులకు అక్టోబర్ 3 నుంచి 13 వరకు 10 రోజులు పాటు వత్తి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం కోసం విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. దీనికి ఉమ్మడి ప్రకాశం జిల్లా లో నాలుగు కేంద్రాలు సిద్ధం చేశారు. పొదిలి సేయింట్ మేరి బిఇడి కాలేజీ, కనిగిరి ఆల్ఫా అగ్రికల్చర్ కాలేజీ, చీరాలలోని చీరాల ఇంజనీరింగ్ కాలేజీ, విఆర్ఎస్ అండ్ ఎన్ వివిఆర్ కాలేజీలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు కేటాయించిన 672 మంది ఉపాధ్యాయులకు 32 మంది రీసోర్స్ పర్సన్స్ శిక్షణ ఇస్తారు. క్లాస్ రూమ్ మేనేజ్ మెంట్, బోధనపద్ధతులు, టీం మేనేజ్ మెంట్, లెసన్ మేనేజ్ మెంట్ తదితరమైన మెళకువలపై శిక్షణ ఇవ్వనున్నారు. స్కూల్ అసిస్టెంట్స్ ఇంగ్లీష్(99), తెలుగు (39), హిందీ (27), ఉర్దూ (2) మొత్తం 167 మందికి పొదిలి సేయింట్ మేరి బిఇడి కాలేజీలో శిక్షణ ఇస్తారు. ఇక్కడ ఎనిమిది మంది రీసోర్స్ పర్సన్స్ పాల్గొంటారు. కాగా స్కూల్ అసిస్టెంట్స్ మాథ్స్(95), బయాలజీ (72), ఫిజిక్స్ (26) మొత్తం 193 మందికి చీరాలలోని చీరాల ఇంజనీరింగ్ కాలేజీలో శిక్షణ ఇస్తారు. ఇక్కడ 10 మంది రీసోర్స్ పర్సన్స్ పాల్గొంటారు. స్కూల్ అసిస్టెంట్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (72) సోషల్ స్టడీస్ 108 మందికి చీరాలలోని విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కాలేజీలో శిక్షణ ఇస్తారు. ఇక్కడ ఎనిమిది మంది రీసోర్స్ పర్సన్స్ పాల్గొంటారు. కాగా ఎస్‌జిటి తెలుగు 124, ఉర్దూ 8 మంది.. మొత్తం 132 మందికి కనిగిరి లోని ఆల్ఫా అగ్రికల్చర్ కాలేజీలో శిక్షణ ఇవ్వనున్నారు. ఇక్కడ ఆరుగురు రీసోర్స్ పర్సన్స్ పాల్గొంటారు.

సచివాలయ ఉద్యోగుల పోరుబాట

అధికారిక వాట్సప్ గ్రూపుల నుంచి నిష్క్రమిస్తున్న వైనం

▶ మెయిన్ 2లో

లంక గ్రామాలను చుట్టుముట్టిన వరద నీరు

(మొదటిపేజీ తరువాయి)

ఉండాలన్నారు. ముంపు గ్రామాలలో ఇప్పటికే 80 శాతం నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వరద పరిస్థితులపై గ్రామస్తులకు పరిస్థితులను ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా తెలియజేయాలన్నారు. ముంపు ఉన్న గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, సంబంధిత మండల స్థాయిలో అధికారులతో టీమ్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండి పరిస్థితులను ఎప్పటికపుడు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేసిన 25 రిహేబిటేషన్ కేంద్రాలకు వెళ్ళాలన్నారు. రీహేబిటేషన్ కేంద్రాల కు డిఆర్డీఏ పిడి లవన్న ఇన్‌ఛార్జిగా ఉన్నారని తెలిపారు. రీ హెబిటేషన్ కేంద్రానికి విఆర్ఓ, విఆర్ఏ, అంగన్వాడీ వర్కర్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఏయన్ఎంలతో టీం వాట్సాప్ గ్రూప్‌లో వరద పరిస్థితిని అధికారులకు, సిబ్బందికి వెంటనే తెలియజేయాలన్నారు. రీహెబిటేషన్ కేంద్రాలలో తాగు నీరు, మందులు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నా రు. రీహెబిటేషన్ కేంద్రానికి డిప్యూటీ ఎంపీడీఓను ఇంచార్జిగా పనిచేయాలన్నారు, రీహెబిటేషన్ కేంద్ర పరిధిలోని గ్రామస్తుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకొని వరద పరిస్థితులను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలపాలన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు జిల్లా మత్స్యశాఖ అధికారితో సమన్వయం చేసుకొని, లైఫ్ జాకిట్స్,రోప్స్,(తాళ్ళు) అన్ని పరికరాలు సిద్ధంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారిని ఆదేశించారు. రీహెబి టేషన్‌తో పాటు హెబిటేషన్ పరిధిలోని ఉన్న అధికారులు సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి ఎన్ రామలక్ష్మి, డిపిఓ ప్రభాకర్‌రావు, మండల తహశీల్దార్, ఎంపిడిఓ, పంచాయతీ సెక్రటరీ, విఆర్ఓ ఉన్నారు.

ఉద్యోగాలా..ఎక్కడ.?

(మొదటిపేజీ తరువాయి)

నిరుద్యోగ భృతి ప్రకటించినా ఇవ్వడం లేదు. జిల్లాలో ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్లేస్‌మెంట్లు దాదాపుగా లేవు. జిల్లాలో చదివిన విద్యార్థులందరూ ఖాళీగానే ఉంటున్నారు. అనేక మంది విద్యార్థులు ఏదైనా చిన్న ఉద్యోగం కల్పించాలంటూ ఎమ్మెల్యేల వద్దకు క్యూలు కడుతున్నారు. వాళ్లు ఏంచేయాలో తెలియక సందిగ్ధంలో పడుతున్నారు. తల్లిదండ్రులకూ ఆందోళ న తప్పడం లేదు. జిల్లాలో పారిశ్రామిక వాడల్లో ఎక్కడా పరి శ్రమలు రాలేదు. కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలంలో రిలయన్స్ బయో ఇంధనం ఫ్యాక్టరీ పనులు మొదలయ్యాయి. ఇది పూర్తయితే తప్ప ఎవరికీ ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదు. ఇక్కడ ఎలాంటి ఉద్యోగాలు దొరుకుతాయనేదీ చూడాలి. దొన కొండ పరిశ్రమల కేంద్రం ఎండమావిగానే ఉంది. గ్రానైట్ రంగంలో చదువుకున్న యువతకు ఉద్యోగాలే లేవు. స్కిల్డ్ పనులు కావడంతో చాలా కష్టంతో కూడుకున్నవి. మార్కాపురం మెడికల్ కాలేజీ ఆగిపోయింది. ఇప్పుడు అది కూడా పిపిపి పద్ధతిలోకి వెళ్లింది. అంటే ప్రభుత్వ ఆధీనంలో వచ్చే ఉద్యోగాలు కూడా లేకుండా పోయాయి. నగరాల్లో చిన్నచిన్న రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లు, స్ట్రీట్‌ఫుడ్స్ ఎక్కువగా వస్తున్నాయి. పెట్రోలు బంకులు, ఫర్నీచర్స్, మాల్స్. ఫుడ్ ప్రాసెసింగు, సరఫరా వంటి రంగాల్లోనే కొంత ఉపాధి కనిపిస్తోంది. చదువుకున్న యువత కూడా తక్కువ వేతనాలు ఇచ్చినా చిన్నచిన్న ఉద్యోగాల్లోనూ చేరిపోతున్నారు. విద్యార్థులు కూడా ఖాళీ సమయాల్లో ఫ్లిప్‌కార్టు అమెజాన్, మింత్ర, స్విగీ, జమోటా తదితర వ్యాపార, రవాణా సంస్థలకు వివిధ రకాల సేవల్లో బాయ్స్‌గా పనిచేస్తున్నారు. ఇవే ఇప్పుడు ఉపాధిగా మారాయి. ఇవే ప్రధాన ఉద్యోగాలుగా భావిద్దామా? ఆలోచించాలి.

నేడు మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల ఎంపిపి ఎస్కే కాసింబీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ సూరె వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజా సమస్యలపై చర్చలు జరపాలని ఆయన కోరారు.

అందని ద్రాక్షలా మెరుగైన వైద్యం

ఇబ్బంది పడుతున్న రోగులు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ప్రాంత వాసులకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షలా తయారైంది. గత వైసిపి ప్రభుత్వంలో ఈ ప్రాంత వైద్యావసరాలను గుర్తించింది. ఇక్కడి జిల్లా వైద్యశాల స్థాయి పెంచుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలను మంజూరు చేయడం జరిగింది. దీంతో పాటు ప్రభుత్వ రంగంలో మెడికల్ కళాశాలను సైతం మంజూరు చేయడం వైద్యం పట్ల గత వైసిపి ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకుంది!

గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వైద్య రంగం నిర్వీర్యం చేసేలా పాలకులు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను నిలిపివేసింది. కూటమి ప్రభుత్వానికి అనుకూలమైన పెద్దలకు ఇక్కడి మెడికల్ కళాశాలను పిపిపి పద్ధతిలో నిర్వహించేందుకు ఈ పాటికే టెండర్లు కూడా పిలవడం జరిగింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు స్వస్తి చెప్పారు. మొత్తానికి ప్రైవేటు వైద్యానికి ప్రస్తుత కూటమి సర్కార్ పచ్చ జెండా ఊపింది!!

వైద్యం ఖరీదైన నేటి రోజుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు ప్రైవేటు వైద్య సేవలు పొందడం కష్టతరమైంది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారంతా ప్రభుత్వ వైద్యశాలను ఆశ్రయించడం జరుగుతోంది. ఇక్కడి అవసరాలకు అనుగుణంగా మార్కాపురం పట్టణంలో 'ప్రభుత్వ జిల్లా వైద్యశాల' స్థాయి పెంచుతూ గత ప్రభుత్వ సర్వజన వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ కారణంగా వైద్యుల సంఖ్య పెరిగింది. వైద్య సిబ్బంది సంఖ్య కూడా పెరిగింది. 150 పడకల నుంచి 330 పడకలు పెరిగాయి.

మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల

అన్ని రకాల స్పెషలిస్ట్ వైద్యుల నియామకం జరిగింది. 28 మంది వైద్యుల స్థాయి నుంచి 236 వైద్యుల స్థాయికి తీసుకువచ్చారు. అందులో 78 మందికి పైగా వైద్యుల నియామకం జరిగింది. దానికి తగినట్లుగా వైద్య సిబ్బందిని పెంచారు. ఆ కారణంగా మార్కాపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల రోగులకు మెరుగైన సేవలు అందుతుండటంతో వందలాది మంది రోగులు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకున్నారు. గత ప్రభుత్వ కాలంలో వైద్య సేవలు ఆ విధంగా అందుబాటులో ఉండగా... టిడిపి నాయకత్వాన అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ సర్వజన వైద్యశాల స్థాయిని దిగజారుస్తూ గతంలో మాదిరిగా ప్రభుత్వ జిల్లా వైద్యశాలగా మార్పు చేసేందుకు ప్రభుత్వం సిద్ధపడటం వింతగా ఉంది. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కూడా ఇటీవల అసెంబ్లీలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల స్థాయిని తగ్గించేలా జిల్లా వైద్యశాల చాలన్నట్లుగా ప్రభుత్వాన్ని కోరడం విడ్డూరంగా ఉందని జనంలో చర్చ సాగుతోంది!

రహదారిపై మట్టి కుప్పలు.. ప్రమాదాలకు పిలుపులు

పట్టించుకోని ఆర్అండ్‌బి అధికారులు • పొదిలి పట్టణ రహదారి విస్తరణ ఎప్పుడో?

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలో ప్రధాన రహదారి అధ్వానంగా తయారై ఎక్కడికి ఎక్కడ మురికి కూపంగా మారింది. ప్రధాన రహదారి వెంట వ్యాపారస్తులు పెద్ద ఎత్తున మట్టితోలి ఆక్రమించుకోవడంతో నీరు రోడ్డుపై చేరింది. వాటి పక్కనే గుంతలు ఏర్పడడంతో వాటిని పూడ్చేందుకు మరలా మట్టి తోలుతున్నారు. ఈ మట్టి కుప్పలతో రాత్రి వేళల్లో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా రహదారులు భవనముల శాఖ అధికారులు స్పందించడం లేదు. పొదిలి విశ్వనాథపురంలో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. విశ్వనాథపురం ఆంజనేయ స్వామి గుడి సెంటర్ నుంచి మార్కాపురం అడ్డరోడ్డు వరకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు లేక పోవడంతో వర్షపు నీటితో ప్రధాన రహదారి దెబ్బతింది. నగర పంచాయతీ అధికారులు మొక్కుబడిగా ఇక్కడ ఆక్రమణలు తొలగించకుండా వదిలేయడంతో వాహన చోదకులు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తూరులో నగర పంచాయతీ అధికారులు తక్షణం

విశ్వనాథపురం ఆంజనేయస్వామి గుడి ఎదురుగా రహదారి పైన పోసిన మట్టి కుప్ప

రహదారి ఇరువైపులా ఉన్న మట్టిని తొలగించి డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలని పట్టణ ప్రజల కోరుతున్నారు. రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీతో అల్లాడుతున్న ఈ మార్గంలో దశాబ్ద కాలంగా పట్టణంలో రహదారి విస్తరణ చేపట్టాలని ప్రజలు ఆశిస్తున్న ఇటువంటి పురోగతి లేకపోవడంతో ప్రజలు పాలకులపై నమ్మకాలు కోల్పోతున్నారు.

కార్మిక హక్కులు హరిస్తే.. ఐక్యంగా పోరాడతాం..

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాసంఘాల నేతలు వ్యవసాయ కార్మిక సంఘం టి.కృష్ణమోహన్, రైతు సంఘం వి.వెంకటరామయ్య, యుటిఎఫ్ ఎంవి.సుబ్రహ్మణ్యం, కౌలురైతు సంఘం జి.నాగరాజు, తదితరులు సౌహార్ద సందేశం ఇచ్చారు. ఈ మహాసభలో జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు తీర్మానాలను ఏకగ్రీవం గా ఆమోదించడం జరిగింది. నూతన జిల్లా కమిటీ 31 మందిలో 10 మందితో సిఐటియు ఆఫీస్ బేరర్స్ ఎన్నిక కావడం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.మజుందార్, జిల్లా అధ్యక్షులుగా ఎం.వసంతరావు, కోశాధికారిగా సిహెచ్.మణిలాల్ జిల్లా ఉపాధ్యక్షులుగా, సహాయ కార్యదర్శిలుగా పి.రేఖ ఎలిజిబెత్, ఎం వెంకటేశ్వరమ్మ, ఎంసిహెచ్. వీరాంజనేయులు, కే.శరత్ బాబు, పి.మనోజ్, కె.ఝాన్సీ, టి.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడులోని గంగా పార్వతీ సమేత త్రిపురాంతక స్వామి వారి ఆలయంలో వేంచేసి ఉన్న పార్వతి అమ్మవారికి ఘనం గా దేవీ నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలు ఆదివారం నాటికి అయిదో రోజుకు చేరుకున్నాయి. ఎండోమెంట్, దాతల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు ఎస్ బుజ్జిబాబు శర్మ ఆధ్వర్యంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్టోబర్ రెండో తేదీ వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. అయిదో రోజున ఆదివారం నాడు అన్నపూర్ణాదేవి అవతారంలో పార్వతి అమ్మవారిని తీర్చిదిద్దారు. ఎండోమెంట్ ఈవో ఎన్ నారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ శిఘాకొల్లి ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు ఆనాల శ్రీనివాసరావు, గడ్డం శ్రీలక్ష్మి, మద్దిరాల అంజమ్మ, నీలం చిన్న, సన్నమూరి వెంకటసుశీల, పాలేటి పద్మ, గుంటూరు రంగనాయకులు వేడుకలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని లైటింగులతో అలంకరించారు. ఆదివారం ఉభయ దాతలుగా మండలంలోని ఎండ్లూరు గ్రామానికి చెందిన గుర్రం శేషమ్మ కుమారులు అనిల్‌కుమార్, దిలీప్‌కుమార్, సంతనూతలపాడుకు చెందిన రామకోటి వెంకటరమణ, దొడ్ల సుబ్బయ్య, బి మాచవరం గ్రామానికి చెందిన నామినేని అప్పయ్య, కోనేటి హరీష్ బాబు వ్యవహరించారు. ఈ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. అనంతరం ప్రసాదాలను పంపిణీ చేశారు. శివ పార్వతులను ప్రత్యేక అలంకరణలతో ఆలయ అర్చకులు ఎస్ బుజ్జిబాబుశర్మ తీర్చి దిద్దారు. సంతనూతలపాడులోని అంకాలమ్మ తల్లి దేవస్థానం, విద్యుత్ కార్యాలయం సమీపంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో, ఆవుల వారి బజారులో శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో, వడ్డెరపాలెం కమ్యూనిటీ హాల్ వద్ద వడ్డెర సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పేర్నమిట్ట పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

వన్యప్రాణులను వేటాడితే ఏడేళ్లు జైలు: ఎఫ్ఆర్ఓ

ప్రజాశక్తి-మార్కాపురం

ఇక మీదట కుందేలు, అడవి పందులతో సహా వన్యప్రాణులను వేటాడితే ఏడేళ్ల జైలు శిక్ష పడుతుందని మార్కాపురం ఎఫ్ఆర్ఓ పిచ్చిరెడ్డి హెచ్చరించారు. మార్కాపురం పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. పిచ్చిరెడ్డి మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడే వుచ్చులను, నాటు తుపాకులను తమకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా వేటాడుతున్నట్లు సమాచారం అందజేసిన వారికి తగిన పారితోషకం ఇస్తామని తెలిపారు. అలాంటి వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రవికుమార్, బాలాకుమారి, ఏడుకొండలు, రామసుబ్బారావు, ధనలక్ష్మి, డ్రైవర్ షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఫ్ఆర్ఓ పిచ్చిరెడ్డి

డాకుమెంట్స్ పోయినవి

ప్రకాశం జిల్లా, గిద్దలూరు మండలం, గిద్దలూరు పట్టణానికి చెందిన **బాదం వరలక్ష్మి భర్త బాదం వెంకట సుధాకర్** కు చెందిన గిద్దలూరు పట్టణంలోని 8వ వార్డు పెద్ద పోస్టాపీసు వీధిలోని స్థలానికి సంబంధించిన రిజిష్టర్ డాక్యుమెంట్లకు సంబంధించిన ఒరిజినల్ లింక్ డాకుమెంట్స్ పోయినవి. డ్యాకుమెంటు నెంబర్లు **4650/202012** మరియు **4085/2012** జిరాక్స్ తీయించుకునేందుకు ఇంటివద్ద నుండి రైల్వే స్టేషన్ రోడ్డులోని జిరాక్స్ షాపులకు వెళ్ళు సమయంలో మార్గమధ్యలో పోయినవి. వెతికినా కనిపించలేదు. ఎవరికైనా దొరికిన యెడల తమకు అందజేయగలరు. తేదీ :**28-09-2025**

బాదం వరలక్ష్మి

సెల్ **9908470787, 9866279312**

మండల సమావేశంలో ప్రోటోకాల్‌పై రగడ

సమావేశం నుంచి వెళ్లిపోయిన ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి-సిఎస్‌పురం

సిఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశంలో ప్రోటోకాల్ విషయంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసి సమావేశం నుంచి వెళ్లిపోయారు. సమావేశం ప్రారంభానికి ముందుగా ఎంపీడీవో ప్రతాపరెడ్డి ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లును అధ్యక్షత వహించవలసిందిగా ఆహ్వానించారు. అనంతరం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని ఆహ్వానించారు. సమావేశానికి తహశీల్దార్ మహమ్మద్ హుస్సేన్ హాజరు కాకపోవడంతో ఎమ్మెల్యే ఎంపిడిఓను ప్రశ్నించారు. తమకు సమాచారం ఏమీ ఇవ్వలేదని ఆయన సమాధానం చెప్పారు. అంతలో జిల్లా షీప్ సొసైటీ ప్రెసిడెంట్‌ను స్టేజి మీదకి ఆహ్వానించాలని ఎమ్మెల్యే ఎంపిడీఓకు చెప్పగా ఎంపీపీ జోక్యం చేసుకొని వైస్ ఎంపీపీలను కూడా పిలవాలని చెప్పడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మా పార్టీలో జిల్లా పదవులు ఉన్నవాళ్లను కూడా పిలవకుండా ఏంటిది? మీరే సమావేశం జరుపుకోండి మాకు అవసరం లేదు అంటూ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు.

మాట్లాడుతున్న ఎంపీపీ మూడుమంచు వెంకటేశ్వర్లు

బిల్లులు చెల్లించకపోవడంపై ఎంపీపీ ఆగ్రహం

పంచాయతీల్లో సర్పంచులు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి అభివృద్ధి పనులు చేశారని, చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు ఎందుకు పెట్టలేదని ఎంపీపీ మూడుమంచు వెంకటేశ్వర్లు అధికారులపై మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మూడుమంచు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు పార్టీలకతీతంగా గ్రామాలలో ప్రజలందరికీ న్యాయం చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటల పెంపకం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్నదని ప్రస్తుత డీఎస్సీలో కొంతమేర ఉపాధ్యాయ పోస్టులు మండలానికి మంజూరయ్యే అవకాశం ఉందని ఎంఈవో జగన్నాథం ప్రసాదరావు తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోక కుండా ముందస్తు టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి మునీర్ తెలిపారు. మండలానికి రెండో విడతగా 62 గోకులం షెడ్లకు ప్రతిపాదన పంపించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రతాపరెడ్డి, జడ్పిటిసి మేకల శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు,అధికారులు పాల్గొన్నారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బైక్‌ను ఢీకొన్న బస్సు.. విద్యార్థి మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

జస్వంత్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన సంఘటన దోర్నాల–కర్నూలు జాతీయ రహదారిపై కొత్తూరు సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. చిత్తూరు జిల్లా తంబళపల్లి మండలానికి చెందిన ఈడకొట్టు జస్వంత్(21) మార్కాపురం లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. తన సొంత పని మీద కర్నూలు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై మార్కాపురం వస్తుండగా కొత్తూరు సమీపంలో ఎదురుగా వచ్చిన కర్ణాటకకి చెందిన బస్సు బలంగా ఢీకొట్టడంతో అతడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. దోర్నాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనులు చేపడుతున్న దృశ్యం

డీజీపేట ఎస్సీ కాలనీలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-సిఎస్పురం రూరల్

మండలంలోని డిజిపేట ఎస్సీ కాలనీలో అధికారులు ఆదివారం పారిశుధ్య పనులను చేపట్టారు. డిజిపేట ఎస్సీ కాలనీలో సైడ్ కాలవలు పూడుకుపోయి మురికి నీరు ప్రధాన ఆర్‌అండ్‌బి రోడ్డు పైకి చేరి రోడ్డు ధ్వంసం అవుతోంది. ఈ సమస్యలను ప్రస్తావిస్తూ 'డీజీపేట ఎస్సీ కాలనీలో పారిశుధ్యం అధ్వానం' శీర్షికన 26న ప్రజాశక్తి ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. డిఎల్డిఓ, మండల ప్రత్యేక అధికారి కె.శ్రీనివాసులు రెడ్డి ఆదేశాలతో ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి హైమావతి, సర్పంచ్ తండ్రి ఊటుకూరి కృపారావులు ఆదివారం ఎస్సీ కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీలో ఉన్న మురికిని తొలగించి ఆర్‌అండ్‌బి రోడ్డుపైకి నీరు రాకుండా చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లించి సమస్యను పరిష్కరించారు.

రక్తదానంతో నిండు ప్రాణాలను కాపాడొచ్చు

ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కనిగిరి : ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్ 118 జయంతి సందర్భంగా కనిగిరి పట్టణంలోని సుందరయ్య భవన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి ఐసిడిఎస్ ఉద్యోగి సుబ్రహ్మణ్యం పూలమాలవేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్‌హెచ్‌ఆర్‌సి నేషనల్ కన్వీనర్ గుత్తి శ్రీధర్ మాట్లాడుతూ 23 ఏళ్ల వయసులో దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ జయంతి రోజు రక్తదానం చేయడానికి యువత ముందుకు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. యువత మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు బానిస కాకుండా దేశభక్తి, సామాజిక స్పృహ, సేవా దృక్పథం కలిగివుండాలని అన్నారు. డివైఎఫ్ఐ మాజీ నాయకులు పీసీ కేశవ రావు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదానికి, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని అన్నారు. రక్తదాన శిబిరంలో 30 మంది రక్త దానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి చీమకుర్తి జవహర్ హాస్పటల్ వారు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కనిగిరి పట్టణ కార్యదర్శి పాండురంగారావు ,డివైఎఫ్ఐ కనిగిరి పట్టణ కార్యదర్శి పి.నరేంద్ర, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాస రెడ్డి, ఐద్వా నాయకులు లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న గుత్తి శ్రీధర్

గుండెపోటుతో గ్రానైట్ యూనిట్ యజమాని మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

చంద్రశేఖర్ (ఫైల్)

మండలంలోని బుధవాడ పంచాయతీ పరిధిలోని సాయి ప్రభ గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ యజమాని చంద్రశేఖర్ (38) గుండెపోటుతో ఆదివారం వేకువజామున ఒంగోలులోని ఆయన నివాసంలో మృతి చెందారు. అందిన వివరాల ప్రకారం.. చంద్రశేఖరు గత 15 ఏళ్లుగా బూదవాడ పంచాయతీ పరిధిలో గ్రానైట్ పాలుషింగ్ యూనిట్‌ను నడుపుతున్నారు. అయితే ఇటీవల మైనింగ్ అధికారులు ఆయన యూనిట్కు సంబంధించి ఎండియల్ నిలిపివేశారు. దానికి సంబంధించిన పెనాల్టీ రుసుమును చంద్రశేఖర్ కట్టారు. గత వారం క్రితం దాదాపు రూ 10 లక్షలతో గ్రానైట్ రాళ్లను కొనుగోలు చేసి, అవి పూర్తిగా వృధా కావడంతో తీవ్ర నష్టాలు పాలయ్యారు. దీనికి తోడు సీనరేజి వసూలు ప్రైవేటు కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. అక్టోబర్ 1 నుండి గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల నుంచి సీనరీ వసూల్ చేసే బాధ్యత ప్రైవేటు కంపెనీ తీసుకోవడంతో, యూనిట్లపై ఎంత వసూలు చేస్తారని భయాందోళనలు యజమానుల్లో ఉంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి చంద్రశేఖరు తన మిత్రులతో మరియు కుటుంబ సభ్యులతో తన ఆర్థిక సమస్యలపై, రాబోయే భారాలపై చర్చించినట్లు తెలిసింది. తీవ్ర మనస్థాపానికి గురైన చంద్రశేఖరు ఆదివారం రేపు జామున నిద్రలోనే గుండెపోటుతో చనిపోయినట్లు కుటుంబసభ్యులు తెలుపుతున్నారు. చంద్రశేఖర్ తాడిపత్రికి చెందిన గ్రానైట్ వ్యాపారి. 15 ఏళ్లుగా చీమకుర్తి ప్రాంతంలో అందరితో కలిసి మెలిసి గ్రానైట్ వ్యాపారం చేస్తున్నాడు. చంద్రశేఖర్ మృతి గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానులలో తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. చంద్రశేఖర్ మృతి పట్ల చీమకుర్తి, ఆర్‌ఎల్ పురం, బోదవాడ, ఏలూరు రోడ్డు గ్రానైట్ పాల్ సింగ్ యూనిట్ల యజమానుల సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి. చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మట్టితవ్వకాలను అడ్డుకున్న అధికారులు

అక్రమంగా మట్టి తరలిస్తున్న జెసిబి, ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని మేళం చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్న జెసిబి, ట్రాక్టర్లను ఆదివారం రెవిన్యూ, పోలీస్ అధికారులు దాడులు చేసి సీజ్ చేశారు. చెరువులో అక్రమంగా ఒక జెసిబి, మూడు ట్రాక్టర్లతో మట్టిని తరలించడంతో సమాచారం అందుకున్న ఎస్ఐ బి.మహేంద్ర, వీఆర్వో సింహాద్రి ఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ఒక జెసిబిని మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-కొండపి : మండలంలోని కోయవారిపాలెంలో పేకాట ఆడుతున్నఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కొండపి ఎస్ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు కోయవారిపాలెంలో సిబ్బందితో కలిసి దాడి చేసి అదుపులోని తీసుకొని వారి వద్ద నుంచి రూ.6,850 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-పామూరు : పామూరు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శారద స్కూల్‌లో దసరా సంబరాల పేరుతో రెండో రోజు పాటలు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.తిరుపతి రెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకులు జె.వెంకట్రావు, జెవివి శంకర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు షమ్మీ, పామూరు పట్టణ కార్యదర్శి ధనలక్ష్మి, ఖాదర్ ఉన్నిసా, మదారమ్మ, పాల్గొన్నారు. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పాటలు డాన్స్ డ్రాయింగ్ మొదలైనవి నేర్చుకోవాలన్నారు. పామూరు పట్టణంలో పండుగ సందర్భంగా విద్యార్థులు చెడుమార్గం పట్టకుండా ఉల్లాసంగా ఉండేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

డాక్టర్ వెంకయ్య ఆశీర్వాదం

ప్రజాశక్తి -కొండపి

కొండపి మండలం కొండపి గ్రామానికి చెందిన నాగుర్ నూర్జహాన్ కుమారుడు బషీర్ వివాహ వేడుకలకు మాజీ పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య ఆదివారం పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మారెడ్డి వెంకటాద్రి రెడ్డి, గొట్టిపాటి మురళి, మండవ మాలకొండయ్య, వన్నూరు, యామవరపు వీర వసంతరావు, కోటపాటి చంద్ర, భువనగిరి సత్యనారాయణ, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో నాపరాళ్లు ఏర్పాటు

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండలంలోని బొద్దికూరపాడు సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రేకుల మండపము క్రింది భాగంలో పూజారి నుదురుపాటి రమణయ్య ఆధ్వర్యంలో గ్రానైట్ రాళ్లు వేయించారు. కార్తీక మాసంలో మహిళలు ప్రమిదలు వెలిగించుకోవడానికి, పండుగలు, పెళ్లిళ్లకు సౌకర్యవంతంగా ఉంటుందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

నాపరాళ్లు పరిచిన దృశ్యం

వినతులు స్వీకరించిన మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రజల నుంచి ఆదివారం వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను పరిష్కరించారు. సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

వినతులు స్వీకరిస్తున్న మంత్రి స్వామి

సమావేశంలో మాట్లాడుతున్న బుర్రి ఆంజనేయులు

పెంపకందారులకు రుణాలివ్వాలి

ప్రజాశక్తి - చీరాల

గొర్రెలు, మేకలు పెంపకం దారులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి బుర్రి ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని బోయిన వారిపాలెంలో ఏర్పాటు చేసుకున్న సొసైటీ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. పెంపకం దారుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాల్లో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. వసుగ్రాసం దొంగతనాలు సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. కొన్నిచోట్ల పశువుల కాపరులను హత్యలు చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీవాలకు ఉచిత బీమా అమలు చేయాలని, 50శాతం సబ్సిడీతో నాబార్డ్ రుణాలు పెంపకం దారులకు ఇవ్వాలని, దాడులు అరికట్టడానికి సామాజిక రక్షణ చట్టం చేయాలని కోరారు. సమావేశంలో గడ్డం వెంకటేశ్వర్లు, ఎరాకుల శివయ్య, ఎర్రాకుల ప్రకాశం, పంచకట్ల నాగరాజు, గడ్డం శ్రీనివాసరావు, గడ్డం యేసు రాజు, పిన్నిబోయిన గోపి పాల్గొన్నారు.

కాఫీ షాపు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

అరకు కాఫీ షాపు ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని వాడరేవులో అరకు కాఫీ షాపును శాసన సభ్యులు ఎంఎం కొండయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు కాఫీ ప్రాముఖ్యత మరింత పెంచే దిశగా ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. నూరు శాతం ఆర్గానిక్ ఉత్పత్తి కావడంతో సహజ సిద్ధంగా లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఒ చంద్రశేఖర్, వేటపాలెం తహశీల్దారు, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దళిత నాయకులు నీలం నాగేంద్రరావు

అంబేద్కర్ విగ్రహ ఘటనపై స్పందించాలి

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

అంబేద్కర్ విగ్రహం మాయం చేసిన ఘటనలో కలెక్టర్, ఎస్పీ స్పందించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహన్ని అధికార తెలుగు దేశం నాయుకుల కను సన్నల్లో కార్యదర్శి శ్రీనివాసరావు నాటకీయ పరిణామాల నేపథ్యంలో మాయం చేసిన విషయంపై నెల రోజులుగా కొనసాగుతున్న స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. సర్పంచ్ వీరయ్య చౌదరిని సంఘటన స్థలానికి పిలిపించి మాట్లాడారు. పంచాయతీలో తీర్మానం చేశారని తెలిపారు. పంచాయతీ సెక్రటరీ అన్నిబోయిన శ్రీనివాసరావు అక్రమంగా తీసుకెళ్లారని అన్నారు. అడ్డుపడిన ఎస్సీ మహిళలపై దౌర్జన్యం చేసి నెట్టివేశాడని అన్నారు. అధికారులు విచారణ చేసి కాలనీ వాసులకు న్యాయం చేయాలని కోరారు. సెక్రటరీ శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి చర్య తీసుకోవాలని కరవాది సుబ్బారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్ష, కార్యదర్శులు దార అంజయ్య, కాకుమాను రవి, అంకం కిరణ్ కుమార్, చిట్టీమాల కాంతారావు, దర్నాసి రామారావు, సంగం కోటేశ్వరరావు, తానికొండ ఆనంద్ పాల్గొన్నారు.

వ్యవసాయ రుణ మాఫీ చేయాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - ఇంకొల్లు

వ్యవసాయం సాగు చేయాలంటే భయపడే పరిస్థితి ప్రస్తుతం ఉందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామకోటేశ్వరరావు అన్నారు. పకృతి వైపరీత్యాలు, తెగుళ్ళు, కీటకాలు తదితర సమస్యలు తట్టుకొని పండించిన గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలయ్యారని అన్నారు. ఇటువంటి తరుణంలో రైతులు సంక్షోభం నుంచి బయట పడాలంటే ప్రభుత్వాలు వెంటనే రైతు రుణమాఫీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇంకొల్లు, చిన్నగంజాం మండలాల రైతు సంఘం సమావేశం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రైతుల జీవన విధానం, కుంటు పోషణ గురించి చర్చించారు. రైతు ఏ పంట వేయాలో ఏ పంట పండించాలో అర్థం కాని అయోమయ స్థితిలో ఉన్నారని అన్నారు. పంట వేసిన రైతులకు గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదన్నారు. వ్యవసాయం చేసే రైతులు అప్పుల ఊబిలో కురుకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పెట్టుబడులకు తోడు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఆరోగ్య, ఆర్థిక భారం అధికమై అప్పుల పాలయ్యామని తెలిపారు. ఉన్న పొలం అమ్మి అప్పు తీర్చాలన్న కొనేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలు రైతుల పట్ల అనుసరించే విధానాలే కారణమని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు రుణ మాఫీ ఒక్కటే ఊరటం ఇస్తుందని అన్నారు. రైతులకు మద్దతుతో కాకుండా పండిన పంటకు పెట్టుబడి లెక్కేసి గిట్టుబాటు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రైతు సంఘం సమావేశంలో పాల్గొన్న నాయకులు

పరిస్థితులు ఇలాగే కొనసాగితే వ్యవసాయం సంక్షోభంలోనే ఉంటుందని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూములపై కన్నేసి రైతుకు వ్యవసాయం దూరం చేసే దిశగా పథకం వేశారని ఆరోపించారు. వ్యవసాయంలో నష్టం వస్తుందని రైతులే వ్యవసాయాన్ని వదిలే విధంగా చేస్తున్నారని అన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి నార్నె సింగయ్య, యర్రం గోవిందరెడ్డి మాట్లాడుతు ఖరీఫ్ సాగుకు రైతులు ముందుకు రాలేదని అన్నారు. 3వంతులు పైగా పొలాలు ఖాళీగానే ఉన్నాయని అన్నారు.

నల్లబల్లి పొగాకు కొనుగోలు చేయాలి

ప్రభుత్వం గత నాలుగు నెలలుగా పొగాకు చివరి ఆకు వరకు కొంటామని చెప్పినప్పటికీ ఇప్పటికీ రైతుల వద్దనిల్వలు పేరుకుపోయి ఉన్నాయని అన్నారు. గోడాములు లేవన్న సాకుతో మందకోడిగా కొనుగోలు చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. మొదటి గ్రేడు రూ.12వేలు, 2వ గ్రేడ్ రూ.9వేలు, 3వ గ్రేడు రూ.6వేలు ప్రకటించినప్పటికీ మొదటి గ్రేడు అరుదుగా కొన్నారని, ఎక్కువగా రూ.9వేలు, రూ.6వేలు ధర ఇస్తున్నారని అన్నారు. దీనికి తోడు పొగాకు తేమ ఉందని, ఆకుపచ్చ ఉందని, పండుగల ఉందని ఎక్కువ తిరస్కరించారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు రైతుల వద్ద నిలువ ఉన్న పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

మొక్కజొన్న సాగుకు పొంచి ఉన్న ధర సమస్య

ఈ ఏడాది రవిలో మొక్కజొన్న వేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ప్రస్తుతం శనగ ధరతో పాటు మొక్కజొన్న ధర కూడా పతనమైందని అన్నారు. క్వింటాలు రూ.2600 పలికిన మొక్కజొన్న ధర ప్రస్తుతం రూ.2250 నుంచి రూ.2300 లోపే కొంటున్నారని తెలిపారు. కావున ప్రభుత్వం మొక్కజొన్న సాగుపై అవగాహన కలిపించి అవసరం మీదకే సాగు అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రైతులకు గిట్టుబాటు అయ్యేలా క్వింటా రూ.3వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎర్ర శనగలు కూడా ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కనీసం క్వింటా రూ.8వేలు తగ్గకుండా కొనుగోలు చేయాలని కోరారు. సమావేశంలో చిలుకూరి శ్రీనివాసరావు, బండి సాంబయ్య, బొగ్గవరపు శంకర్రావు, అన్నం ఆదియ, మానం సుబ్బారావు, బాచిన కోటేశ్వరరావు, మాదాల అంజయ్య, కొల్లూరి హనుమంతరావు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో ఖోఖో సూపర్ లీగ్ పోటీలు

ప్రజాశక్తి - పంగులూరు

దసరా పండుగ సందర్భంగా పంగులూరులో మరోసారి ఖో ఖో పండగ నెలకొంది. ఈనెల 29, 30 తేదీల్లో మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఖో ఖో సూపర్ లీగ్ పోటీలు జరగనున్నాయి. స్థానిక ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ డైరెక్టర్ ఎం సీతారామిరెడ్డి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పంగులూరు గ్రామం పేరు చెప్పగానే ప్రజల ఆప్యాయత, సహాయం చేయడానికి ఎప్పుడు ముందుండే గుణం గుర్తుకు వస్తుందని అన్నారు. గ్రామ పెద్దల సహాయ సహకారాలతో ఎన్నో రాష్ట్రీయ, జాతీయ స్థాయి ఖోఖో పోటీలు, మరెన్నో క్యాంపులు నిర్వహించామని అన్నారు. దసరాకి మరోసారి ఖో ఖో పండగ వాతావరణం నెలకొంటుందని చెప్పారు. ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ చైర్మన్, మాజీ శాసన సభ్యులు బాచిన చెంచు గరటయ్య ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా ఖో ఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో ఆరు టీములు తలపడ నున్నాయని తెలిపారు. మ్యాచ్‌లు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుండి రాత్రి 12 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో మొట్ట మొదటిసారి లీగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి కూడా పంగులూరు గ్రామ మే వేదిక కావటం ఇక్కడున్న ప్రజలకు, గ్రామ పెద్దలకు ఖోఖో ఆటపై ఉన్న ఆప్యాయత, ప్రేమను తెలియజేస్తుందని అన్నారు. గ్రామ పెద్దలు, సీనియర్ క్రీడాకారులు ఈ లీగ్‌ను విజయవంతం చేసి మరోసారి పంగులూరు ఆతిధ్యాన్ని తెలియజేయాలని కోరారు. టోర్నమెంట్ ప్రారంభానికి బాచిన చెంచు గరటయ్య, తహశీల్దారు సింగారావు, గ్రామ పెద్దలు హాజరవుతారని తెలిపారు.

ఖోఖో సూపర్ లీగ్ మ్యాచ్‌లో పాల్గొనబోయే జట్టు

మెడికల్ క్యాంపుకు హాజరైన ప్రజలు

వాడరేవులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - చీరాల

వాడరేవు శ్రీశ్రీశ్రీ రామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమం ఆవరణలో షుగరు వ్యాధికి ఉచిత వైద్య శిభిరం ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వేకువ జాము నుండే వచ్చిన 1209 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. నెల రోజులకు సరిపడు మందులు ఉచితంగా అందజేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. శిభిరానికి హాజరైన వారందరికి అల్పాహారం, తాగునీరు, ఇతర సహాయక ఏర్పాట్లు చేశారు. షుగర్ వ్యాధి బాధితులు వేచి ఉండ కుండా వేగంగా వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. విస్తృత ఏర్పాట్లతో మధ్యాహ్ననికే వచ్చిన వారందరికీ వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా షుగరు వ్యాధిపై రోగులకు వైద్యులు అవగాహన కల్పించారు. వైద్య శిభిరంలో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ ప్రకాష్ వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, సాయి ఫణికిషోర్, చందన, కామేశ్వరరావు, ఎంజి శంకరరావు, బసవరావు, కుమార్, కె లింగరాజు, మోహన్, మిత్ర ల్యాబ్ వలి, గోపాల్, వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు రోగులకు ఆహారం, తాగునీటి వసతులు, సహాయక ఏర్పాట్లు చేశారు.

దసరా కానుకగా డిఎ ప్రకటించాలి

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు దసరా కానుకగా కరువు భత్యం (డిఎ) ప్రకటించాలని ఎస్టియు జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుడివాడ అమరనాథ్ కోరారు. ఎస్టియు జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2024 నుండి 4 డిఎలు పెండింగులో ఉన్నాయని అన్నారు. పిఆర్సి, డిఎ, సరెండర్ లీవ్ బకాయిలు, పిఎఫ్, ఎపిజిఎల్ఐసి రుణాలు, మెడికల్ రీ ఎంబర్స్ మెంట్ బిల్లు బకాయిలు రూ.25 వేల కోట్లు ఉన్నాయని అన్నారు. అసెంబ్లీ సమావేశాల చివరి రోజు తాజా మాజీ ఎమ్మెల్యేలకు పింఛను, వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని అసెంబ్లీ కమిటీ సిఫార్సు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం, వైద్య సదుపాయాలు కల్పించమంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని సాకులు చెబుతుందని అన్నారు. డిఎస్‌సి ద్వారా కొత్త ఉపాధ్యాయులు వస్తున్నందున ఎంటిఎస్ ఉపాధ్యాయులను ఏకోపాధ్యాయ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని అన్నారు. ఉపాధ్యాయువాణి కన్వీనర్ పివి నాగరాజు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిషనర్ నియామకం ఆలస్యం అవుతున్నందున తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నూర్ భాషా సుభాని, జిల్లా ఆర్థిక కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్ జి ఉదయశంకర్, సిహెచ్ నరసింహారావు, గవిని శ్రీనివాస్, పి శివాంజనేయులు, ఎవి నారాయణ, తోట శివయ్య, కోటేశ్వరరావు, నారాయణమూర్తి, ప్రభాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బడుగు శ్రీనివాస్

చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేకోవాలని వైసిపి ఆర్‌టిఐ అధ్యక్షులు పసుపులేటి శివరాం ప్రసాద్ కోరారు. అంతర్జాతీయ సమాచార హక్కు చట్టం దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం ద్వారా చేసే పనులు జాప్యం జరిగితే ఈ చట్టం ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేసే ఈ చట్ట అభినందనియమని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా పాలన చేరువ చేసిందని అన్నారు. వైసీపీ ఇన్‌ఛార్జి వరికుటి అశోక్ బాబు చొరవ తీసుకుని ప్రతి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని అన్నారు.

విస్తృత సమావేశంలో పాల్గొన్న మానవతా సంస్థ సభ్యులు

'మానవతా' సేవలు విస్తరించాలి

సంస్థ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మానవతా సేవా సంస్థ సేవలు మరింత విస్తరించాలని సంస్థ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు చెప్పారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ విస్తృత సమావేశం ఆదివారం కర్నూలురోడ్‌లోని వర్మ గ్రాండ్ కాన్ఫరెన్స్‌లో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ మానవతా సేవా సంస్థ తరపున ఒంగోలులో గల మూడు హిందూ స్మశాన వాటికలను బాగు చేయించి ఆధునీకరించాలని, అక్టోబర్ 5వ తేదీ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సేవాభావం గల ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాలు అందజేయాలని తెలిపారు. మరణించిన వారికి ఉచితంగా అంతిమ వాహనంతో పాటు మార్చురీ బాక్సులు.. పేదలకు మట్టి ఖర్చులు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ వైస్ చైర్మన్ మంగళగిరి నరసింహారావు, అధ్యక్షులు శరభలింగాచారి, డైరెక్టర్లు వడ్డేపూడి సుజాతరావు, కోసూరి శ్రీదేవి, పి.వెంకటరెడ్డి, పి రామసుబ్బారెడ్డి, పి.కనకదుర్గ, నాగలక్ష్మి, చెరుకూరి ఆదిలక్ష్మి, చౌదరి. బుజ్జి పాల్గొన్నారు.

జాషువా జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

చిరస్మరణీయులు గుర్రం జాషువా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

దళిత సాహిత్యానికి ఉన్నత స్థానం కల్పించి, సమాజ సంస్కరణకు తన కవిత్వాన్ని అక్షరాయుధంగా మార్చిన మహాకవి, పద్మభూషణ్ గుర్రం జాషువా చిరస్మరణీయుడని జిల్లా రెవెన్యూ అధికారి చిన్న ఓబులేసు అన్నారు. ఆదివారం నాడు ప్రకాశం భవనంలో గుర్రం జాషువా 130వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిఆర్ఓతో పాటు ప్రముఖులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యన్.లక్ష్మానాయక్, ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జాషువా రచనలు నేటి తరానికి కూడా మార్గదర్శకం అని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఒంగోలు కలెక్టరేట్: కవులకు ఆదర్శ ప్రాయుడు గుర్రం జాషువా అని జై శ్రీకృష్ణ బీసీ సమితి వ్యవస్థాపకులు ద్రావిడ దేశం కస్తూరావు తెలిపారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి ఉత్సవం ఆదివారం జై శ్రీకృష్ణ బీసీ సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ప్రకాశం కలెక్టర్ కార్యాలయంలోని గుర్రం జాషువా కాంస్య విగ్రహానికి పూలమాలతో అలంకరించి.. సంఘం సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గుర్రం జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, బీసీ నాయకులు బంకా చిరంజీవి, చిరుమామిళ్ల గోపికృష్ణ యాదవ్, పెద్దన్న, బ్రహ్మయ్య, ఆవుల మహేష్, అద్దంకి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కులవ్యవస్థ నిర్మూలన కోసం

వర్గ పోరాటాలు నిర్మించాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కులవ్యవస్థ నిర్మూలన కోసం వర్గపోరాటాలు నిర్మించవలసిన అవసరం ఎంతయినా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం జ్యోతిబా పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 153వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఒంగోలులో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కుల నిర్మూలన అవగాహన సభ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సి.ఎస్.సాగర్ మాట్లాడారు. సభలో రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, రైతు-కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కే.నాంచార్లు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్. జాలన్న, పీడీఎస్యూతో పాటు పావో రాష్ట్ర నాయకులు పాల్గొని కుల నిర్మూలన అవసరాన్ని స్పష్టం చేశారు.

గిరిజనులకు అన్యాయం చేస్తే సహించం

జిపిఎస్ జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్

ప్రజా శక్తి, ఒంగోలు కలెక్టరేట్

మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎస్ టి సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. ఒంగోలు గిరిజన భవన్ లో ఆదివారం నిర్వహించిన గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా ఒంగోలు గిరిజన భవన్ల గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ అధ్యక్షతన, జిల్లా అధ్యక్షుడు సైదా నాయక్ ఆధ్వర్యంలో వివిధ గిరిజన సంఘాల ముఖ్య నాయకులతో, మేధావులతో, డాక్టర్లతో, రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షుడు

మాట్లాడుతున్న వడిత్యా శంకర్ నాయక్

మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి నోచక ఇప్పటికీ దిక్కులేని స్థితిలో గిరిజన ప్రజానీకం జీవిస్తున్నారనే విషయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రహించాలన్నారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలోకి చేర్చే అంశాన్ని తీసుకువస్తే గిరిజన జాతి ఏకమై సంకటితంగా ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం, జిల్లా అధ్యక్షుడు సైదా నాయక్, ఎరుకల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎస్ మోహన్ కుమార్ ధర్మ, జిపిఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు విష్ణు నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ హనుమ నాయక్, జై సంతోష్ నాయక్, ఏ శ్రీను నాయక్, వి రాజు నాయక్ పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి 'భగత్‌సింగ్': డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే ప్రాణాలు అర్పించిన విప్లవ యోధుడు షహీద్ భగత్‌సింగ్ యువతకు స్ఫూర్తి అని పలువురు పేర్కొన్నారు. ఆదివారం నాడు భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విజ్ఞాన కేంద్ర కన్వీనర్ ఎస్.కె. పీరు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భగత్‌సింగ్ చిత్రపటానికి బేతస్ నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ టి.పురుషోత్తం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడుతున్న పేద

భగత్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ పురుషోత్తం

ప్రజలకు ఇలాంటి శిబిరాలు గొప్ప తోడ్పాటు అవుతాయన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.ఎఫ్.బాబు మాట్లాడుతూ, భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యోగం, ఉపాధి కోసం యువత పోరాటం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎస్.కె. అమీర్, టి. సురేష్, వై. రవికుమార్, కె. సాల్మన్, మోహన్, పి.శ్రీనివాసరావు, ఎం. నాగేశ్వరరావు, అంకరాజు, శ్రీకాంత్ తదితరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్షుడు పి. కిరణ్, ఉపాధ్యక్షులు టి. సురేష్, మోహన్, టి. దాసు, ఎస్.కె. జబ్బార్, సిఐటియూ జిల్లా నాయకులు చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శి టి. మహేష్, బి.వి. రావు, దామోదర శ్రీను, ఎస్.డి. హుస్సేన్, నాగేశ్వరరావు (మెడికల్), జి. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్విమ్స్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు స్థానిక సుందరయ్య భవన్ రోడ్డులో ఏర్పాటుచేసిన స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు శనివారం ప్రారంభించారు. హాస్పిటల్‌లోని వివిధ విభాగాలను పలువురు ప్రముఖులు ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ ప్రజల డాక్టర్‌గా పేరు తెచ్చుకున్న డాక్టర్ శ్రీనివాసరావు అన్ని సౌకర్యాలతో కూడిన నూతన హాస్పిటల్ ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. ఎక్కువ మంది ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో హాస్పిటల్ ప్రారంభించినట్లు తెలిపారు. షుగర్, బిపి పేషెంట్ల కోసం ప్రత్యేకంగా డయాబెటిస్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డాక్టర్ చల్లా అమల్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఓబులేసు, ప్రముఖ వైద్యులు పి.డి.సి.సి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, ఉపాస్ హాస్పిటల్స్ డైరెక్టర్లు డాక్టర్ ఉమాపతిచౌదరి, అనిల్‌కుమార్, ప్రకాష్ చవల, ఐ.యం.ఎ అధ్యక్షులు శివ సీతారామయ్య, కార్యదర్శి జాలాది మణిబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు, ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, నగరంలోని వివిధ హాస్పిటల్స్‌కి చెందిన వైద్యులు పాల్గొన్నారు.

హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

మాట్లాడుతున్న జనార్ధన్

రేబిస్ టీకా కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్, జేడీ

పెంపుడు కుక్కలకు

విధిగా టీకాలు వేయించాలి

కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పెంపుడు కుక్కలకు యజమానులు విధిగా టీకాలు వేయించాలని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఒంగోలు వెటర్నరీ పాలి క్లినిక్ ఆవరణలో ఆదివారం ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జగత్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పాల్గొని ఉచిత రేబిస్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు రేబిస్ రాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. జిల్లా పశు సంవర్ధక జేడీ డాక్టర్ బి.రవి మాట్లాడుతూ పెంపుడు జంతువులకు రేబిస్ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలు, స్కూలు పిల్లలకు రేబిస్ వ్యాధిపై పాఠశాలల్లో అవగాహన కల్పించాలని కోరారు. దాదాపు 275 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేశారు.

సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోడీ రాజీనామా చేయాలి

కాంగ్రెస్ పార్టీ ఒంగోలు కోఆర్డినేటర్ బి.ఆర్.గౌస్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ఎన్నికల సంఘంతో కుమ్మక్కై ప్రజా మద్దతు లేకుండా గద్దెనెక్కిన ప్రధానమంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేసి నైతికతను చాటుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త బి.ఆర్ గౌస్ డిమాండ్ చేశారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు, పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు ప్రజాక్షేత్రంలో 'ఓట్ల దొంగ – గద్దె దిగు' నినాదంతో ప్రజల మద్దతు కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం, ఒంగోలు నగరంలోని, రెండవ డివిజన్ ముక్తినూతలపాడు, గుడిమల్లపాడు, కేశవరాజు కుంట ప్రాంతాలలో ఒంగోలు రూరల్ అధ్యక్షులు బుజ్జి ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక అధ్యక్షులు వద్దండి మల్లికార్జునరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రవూఫ్, యువజన కాంగ్రెస్ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షులు రాయపాటి గిడియన్ పాల్గొన్నారు.

30న అమెరికా సుంకాలపై సదస్సు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

'అమెరికా విధించిన ఎగుమతి సుంకాలు – భారతదేశంలో వర్తక వాణిజ్య వర్గాలు, వ్యవసాయంపై దాని ప్రభావం – ప్రత్యామ్నాయ మార్గాలు' అంశంపై 30వ తేదీ మంగళవారం నాడు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎల్ బిజి భవన్ లో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సదస్సుకు సిఐటియూ సీనియర్ నాయకులు పూనాటి ఆంజనేయులు హాజరవుతారన్నారు. ఈ సదస్సుకు అందరూ హాజరు కావాలని నిర్వాహకులు మారెళ్ల సుబ్బారావు, టి భక్తసింగ్ రాజు, బి ముసలారెడ్డి కోరారు.

మాట్లాడుతున్న మంత్రి సోదరుడు శివప్రసాద్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రేపల్లె

కృష్ణా నది వరద ప్రభావం కారణంగా పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ హెచ్చరించారు. వరద తీవ్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వరద ముంపుకు గురి అయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా, పటిష్టమైన రక్షణా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పెనుమూడి, పల్లెపాలెంలో నీటి మట్టం పెరుగుతున్నట్లు గుర్తించారు. పల్లెపాలెం ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరారు. పాతబడిన ఇళ్ళు, మట్టి గోడలతో నిర్మించిన ఇళ్లల్లో నివసించే ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

రేకుల షెడ్ నిర్మాణం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంంలోని రావూరిపేట శివారులో కనక నాగవరపమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నాగదేవతలు, అమ్మవారి వేప చెట్టుకు జింకు పైపులతో షెడ్ నిర్మాణం చేశారు. గొర్రె భాస్కరరావు జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని ఉమా సుజాత, కుమారులు సాయి సంతోష్, సాయి ప్రణీత్ ఉద్దేశపూర్వకంగా ఏర్పాటు చేశారు. దాతలు మొక్కుబడిలో భాగంగా గాత్రం బాలసుబ్రమణ్యం, ధర్మపత్ని మహేశ్వరి పూజల అనంతరం వేప చెట్టుకు జింకు పైపులు రేకులు వేసి ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ వలేటి ఆంజనేయులు, ఈఓ పోతిని శ్రీనివాసరావు, ధర్మకర్తలు ఎర్ర శివనాగుమల్లేశ్వరి, సప్పిడి వెంకట్రావు, గుత్తి వరప్రసాదరావు పాల్గొని దసరా నవరాత్రుల సందర్భంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ సిద్ధాంతి డికె మాస్టర్, దేవన గంగాధరరావు, భూసం శ్రీనివాసరావు, చింతం రాము, సజ్జ జయకృష్ణ, టి మహేష్, పింజల ప్రవీణ పాల్గొన్నారు.

కర్రలతో సర్వీస్ వైర్లు నిలుపుకున్న దృశ్యం

విద్యుత్ వైర్లతో పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలో విద్యుత్ సరఫరా పరిస్థితి దుర్భరంగా ఉంది. విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో కర్రలను స్తంభాలుగా నిలిపి ఇళ్లకు సర్వీస్ వైర్లు లాక్కోవాల్సి పరిస్థితి ఏర్పడింది. స్థానిక సర్వోదయ కాలనీ చుండూరి శ్రీనివాసరావు రైస్ మిల్ సమీపంలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న ఒకే ఒక స్తంభంపై పాతిక విద్యుత్తు కనెక్షన్లు ఉండటం గమనర్హం. ప్రతి ఇంటికి విద్యుత్ అందించేందుకు తమ భద్రత చూసుకోకుండానే కష్టపడుతున్నారు. కర్రల మధ్య నిలిచి వైర్లు లాగడం, ప్రతీ క్షణం ప్రమాదానికి హేతువుగా ఉంది. విద్యుత్ సమస్యపై పంచాయతీ, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోకపోవడం, పునరుద్ధరణ పనులు ఆలస్యం అవడంతో ప్రజలు ఇబ్బందులకు కారణమైంది. ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. సడలిపోయిన విద్యుత్ స్తంభాలు భద్రతా ప్రమాణాలతో పునరుద్ధరించింది. సురక్షిత విద్యుత్ సరఫరా కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ నిర్లక్ష్యం కొనసాగితే, ప్రాణనష్టం తప్పనిసరని ప్రజలు హెచ్చరిస్తున్నారు. సంబంధిత అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కర్రలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మహాకవి గుర్రం జాషువాకు ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

ఆధునిక తెలుగు కవుల్లో ప్రముఖ స్థానం గుఱ్ఱం జాషువా సొంతం చేసుకున్నారని అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ రాజేష్ అన్నారు. జాషువా 130వ జయంతి సందర్భంగా కలాం ఫౌండేషన్ సౌజన్యంతో పఠాన్ రాజేష్ ఆధ్వర్యంలో మునిసిపల్ ఆవరణలో ఉంచిన గుర్రం జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివా ళులు అర్పించారు. గణపవరం మాజీ సర్పంచ్ కత్తి దానియేలు, నక్క ప్రకాష్, గవిని ప్రసాద్, కర్నెటి ఏడుకొండలు, నర్రా కొండలు, దయరావు, పాపయ్య, శివ పాల్గొన్నారు.

సంతమాగులూరు : ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్ స్థానిక ఎంపిడిఓ సమావేశం హాలులో గుర్రం జాషువ, భగత్ సింగ్ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఇరువురి ఫోటోలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంఇఒ వేమవరపు కోటేశ్వరరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాకాని సుధాకర్, సర్పంచి పుచ్చకాయల నాగేశ్వరరావు, బండారు పుల్లారావు, ఆదర్శ మల్టీమీడియా అసోసియేషన్ అధ్యక్షులు అంగలకుదుటి కోటేశ్వరరావు, బలుపు నూరి కృష్ణారెడ్డి, షేక్ నాగూర్ వలి, ధూపాటి ఏసోబు, ఉపాధ్యాయ నాయకులు ఎ శేఖర్‌బాబు, పి వలీఖాన్, ముస్తఫా, మసనం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అద్దంకి : కమటేశ్వర స్వామి ఆలయంలో లక్కరాజు శ్రీనివాసరావు అధ్యక్షతన సృజన సాహిత్య సమావేశం నిర్వహించారు. నిమ్మరాజు నాగేశ్వరరావు ప్రారంభించారు.

మేదరమెట్లలో జాషువకు నివాళి అర్పిస్తున్న నాయకులు

గుర్రం జాషువ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కె అనిల్ కుమార్, ఉబ్బా దేవపాలన, ఆర్ రాఘవరెడ్డి, అన్నమనేని వెంకటరావు, వారణాసి రఘురామ శర్మ, పిఎస్‌ఆర్ ఆంజనేయులు, యనమండ్ర వరలక్ష్మి, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, మస్తాన్ మాస్టర్, కొల్లా భువనేశ్వరి, ఆర్ రాఘవరెడ్డి, యోగేశ్వరరావు, కొల్లా పవన్, మాలాది శ్రీనివాసరావు పాల్గొన్నారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా పసుమర్తిపాలెంలోని జాషువా విగ్రహం వద్ద జాషువా సాహిత్య వేదిక తరపున నివాళులర్పించారు. దేవపాలన మాట్లాడారు. పసుమర్తి కోటయ్య, గోరంట్ల నాగేశ్వరరావు రాసిన కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో తాళ్లూరు బాబురావు, నందమూరి కళా పరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, రోటరీ మాజీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, జ్యోతి రమేష్, బుచ్చిబాబు, వై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపల్లె : చిన్నతనం నుండి అంటరాని తనపూ అమానుష నిప్పుల కొలిమిలో మహాకవి గుర్రం జాషువా నిలబడే చదువు కొనసాగించారని న్యాయవాది దారం సాంబశివరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీ హంస జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో మహాకవి గుర్రం జాషువా130వ జయంతి జూలకంటి బుజ్జిబాబు అధ్యక్షతన నిర్వహించారు. నగరం మాజీ ఎంపీపీ చందోలు దేవదాసు మాట్లాడారు. గుర్రం జాషువా ప్రతిభ అవార్డులకు ఎంపికైన 10వ తరగతి విద్యార్థిని గుంటూరు కవితకు రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు. వివిధ రంగాల్లో సేవలందించిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బౌద్ధ రచయిత గోవర్ధన్, గుంటూరు రెడ్డయ్య, హంస కాలేజ్ డైరెక్టర్ సత్యనారాయణ, రిటైర్డ్ ఎంఈఓ భూపతి ధర్మారావు, విజ్ఞాన్ ఒకేషనల్ కాలేజ్ ప్రిన్సిపాల్ మహమ్మద్ సాజిద్ భాష, దర్శి భాస్కరరావు, ఎస్ఎస్ యోగా గురువు గాలి సురేష్, మునిపల్లి సుబ్బయ్య, మహేష్ పాల్గొన్నారు.

మేదరమెట్ల : మహాకవి గుర్రం జాషువా 138వ జయంతి సందర్భంగా మేదరమెట్ల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం కార్యవర్గ సభ్యులు ఎం ఆంజనేయులు, ప్రజా నాట్య మండలి మాజీ అధ్యక్షులు బొంతు దశరథ, సిఐటియు కన్వీనర్ వై రవీంద్రబాబు, జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెరుగుతున్న వరద ముప్పు

ప్రజలు బయటికి రావాలని కోరుతున్న అధికారులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కృష్ణా నదికి ప్రకాశం బ్యారేజీ నుండి విడుదల చేస్తున్న వరద నీరు గంట గంటకు పెరుగుతుంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో రైతులు సాగుచేసిన వాణిజ్య పంటలు నీట మునుగుతున్నాయి. భట్టిప్రోలు, కొల్లూరు పరిధిలోని లంక గ్రామాల్లో ప్రజలను బయటకు తరలించేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. క్రమ క్రమంగా వరద నీరు పెరుగుతున్న దృష్ట్యా గ్రామస్తులు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని, ఇప్పటికే ఏర్పాటు చేసిన బృందాలు ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం నదికి 6.5లక్షల క్యూసెక్కులపైగా వరద నీరు ప్రవహిస్తుంది. ఈ వరద మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు ముందుగానే అధికారుల సూచనలు పాటించి పునరావాస కేంద్రాలకు తరలిరావాలని కోరుతున్నారు. భట్టిప్రోలులోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, టిఎం రావు ఉన్నత పాఠశాల, కెఎస్‌కె జూనియర్ కళాశాలలో పునరావస కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అధికారుల సూచనలు పాటించి తరలిరావాలని తహశీల్దారు మేకా శ్రీనివాసరావు కోరారు. వరద నీటికి లంక గ్రామాల్లో ఎలాంటి నష్టం జరగకూడదని కలెక్టర్ వి వినోద్ కుమార్, రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి, అధికారులు నదీ గర్భ గ్రామాల్లోని ప్రజలకు సూచించారు. బయటకు తరలించేందుకు క్షేత్రస్థాయి అధికారులతో కలిసి పర్యటిస్తున్నారు. భట్టిప్రోలు మండలం చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు, పల్లెపాలెం గ్రామాలతో పాటు కొల్లూరు మండలంలోని గ్రామాల్లో ఈపాటికే లోతట్టు ప్రాంతాలకు నీరు చేరగా రాత్రికి వరద నీరు పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

వరద నీటిలో ఇటుక బట్టీలు

కాలనీలో నిలిచిన వర్షపు నీరు

నీట మునిగిన విఠలేశ్వర కాలనీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అధికారుల నిర్లక్ష్యంతో స్థానిక విఠలేశ్వర కాలనీ నీట మునిగింది. ప్రతి ఏట ఈ కాలనీ వర్షాలకు నీటమునిగి ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉంటున్నారు. దీనికి తోడు ప్రక్కనే ఉన్న వెల్లటూరు ఛానల్ నిత్యం నిండుగా ప్రవర్తిస్తుండటంతో ఈ ఛానల్‌కున్న తూము సంబంధిత అధికారులు మూసివేయ కుండా వదిలేయడంతో నీరు కాలనీ సమీపంలో ఉన్న చెరువులోకి ప్రవేశించింది. దీంతో కాలనీ పూర్తిగా నీట మునిగిపోతుంది. గృహాల్లోని ప్రజలు బిక్కు బిక్కుమంటు కాలం వెల్లదీస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేకపోయినా ప్రతి ఏట తమకు ఈ దుస్థితి తప్పడం లేదని వాపోతున్నారు. 200 కుటుంబాలకు పైగా ఉన్న ఈ కాలనీలో ప్రధాన రహదారి తప్ప ఎలాంటి ఇతర రహదారులు అభివృద్ధి చెందకపోవటంతో ఛానల్ నుండి తుమ్మ ద్వారా వచ్చిన నీటితో కాలనీ మాత్రం మునిగిపోయి పాములు సంచరిస్తూ ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని చెబుతున్నారు. చేపల పాట నిర్వాహకులు తూముల పట్ల నిర్లక్ష్యంగా ఉండటంతో కాలనీకి ఇలాంటి దుస్థితి ఏర్పడుతుందని ఆరోపిస్తున్నారు. అధిక వర్షాల సమయంలో ఎలా కాలనీ ముంపుకు గురికాక తప్పడం లేదని అంటున్నారు.

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా

ప్రజాశక్తి - అద్దంకి

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ పిడుగురాళ్లలోని తన కార్యాలయంలో డిజిటల్ బుక్ ఆదివారం ప్రారంభించారు. కూటమి ఏడాది పాలనలో వైసిపి నేతలపై ఎన్నో దాడులు జరిగాయని అన్నారు. వైసిపీ కార్యకర్తలు, నాయకులు పోలీసు స్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరగలేదని అన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉండేందుకు తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి కార్యకర్తలకు అండగా, భరోసా కల్పించేందుకు డిజిటల్ బుక్ ప్రారంభించారని అన్నారు.

సంతమాగులూరు : పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోని ఆయన నివాసంలో డిజిటల్ బుక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి పోకూరి వెంకయ్య, కేసరి చెన్నారెడ్డి, షేక్ ఖాదర్ బాషా, గడ్డం నర్సిరెడ్డి, ధర్మతేజరెడ్డి, జె రామాంజనేయరెడ్డి, రాణి రాజు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ ప్రారంభిస్తున్న చింతలపూడి అశోక్ కుమార్

పర్చూరు : వైసిపి కార్యకర్తల కోసం డిజిటల్ బుక్, క్యూ ఆర్ కోడ్ ప్రారంభిస్తున్నట్లు వైసిపి ఇన్చార్జ్ గాదె మధుసూదనరెడ్డి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో వైసిపి డిజిటల్ బుక్ పోస్టర్ ఆదివారం ఆవిష్కరించారు. కటారి అప్పా రావు, తోకలకృష్ణ మోహన్, ప్రభాకర్, కొమ్మన బోయిన వాసు, అనిల్ వెంకట్రావు, పఠాన్ మస్తాన్‌వలి, కంచనపల్లి రమేష్, కొల్లా శ్రీహరి, యద్దనపూడి హరిప్రసాద్, శ్రీను, గాదె సురేష్ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న అనగాని శివప్రసాద్

వైభవంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - నగరం

దసరా నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండలంలోని పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి మండపంలో లక్ష్మీదేవి అవతారంతో దర్శనమిచ్చిన అమ్మవారిని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు సమ్మెట కోటేశ్వరరావు (వంశీ), చెరుకుపల్లి తెలుగుదేశం అధ్యక్షులు తాత ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
సోమవారం 29 సెప్టెంబర్ 2025

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చంద్రబాబుకు ధన్యవాదాలు

ప్రజాశక్తి - చీరాల

కుప్పడం చీరకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేందుకు కృషి చేసిన సిఎం చంద్రబాబు నాయుడు, హ్యాండ్లూమ్ మంత్రి సవితమ్మకు శాసన సభ్యులు ఎంఎం కొండయ్య ధన్యవాదాలు తెలిపారు. స్థానిక నేతగాళ్లకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. పేరు ప్రతిష్టలు వస్తాయని పేర్కొన్నారు. హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటుకు చర్యలు అభినందనీయమని అన్నారు. పూర్తి స్థాయిలో ప్రారంభమైతే ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు. స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఫిషింగ్ హార్బర్ ఫైలు ప్రగతి స్థితిపై ఆ శాఖ మంత్రిని ప్రశ్నించారు. మత్స్యకారుల ఆత్మస్థైర్యానికి, జీవనోపాధికి కీలకమని గుర్తు చేశారు. చీరాల ప్రాంత ప్రజల సమస్యలు అసెంబ్లీలో వినిపిస్తూ, అభివృద్ధి సాధనలో కృషి చేస్తానని స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి మహమ్మద్ మొయిన్

పోలీసుస్టేషన్‌లో వార్షిక తనిఖీ

ప్రజాశక్తి - చిన్నగంజాం

స్థానిక పోలీసుస్టేషన్‌ను చీరాల డిఎస్‌పి మహ్మద్ మొయిన్ వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదివారం స్టేషన్ రికార్డులు పరిశీలించారు. కేసుల రిజిస్ట్రేషన్, దర్యాప్తు ప్రగతి, పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై సిబ్బందిని ప్రశ్నించారు. ఆయుధాగారం, లాకప్ గదులు, రికార్డుల సంరక్షణ, డ్యూటీ రోస్టర్లు, పోలీసు సిబ్బంది హాజరు వివరాలు తనిఖీ చేశారు. ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించడం, బాధితులకు న్యాయం చేయడం, నేరాల నివారణపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంకొల్లు సిఐ రమణయ్య, ఎస్ఐ ఎస్ రమేష్, వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎస్ డైరెక్టర్ దాసు

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని ఎస్ఎస్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదర్శ డిగ్రీ కాలేజ్ క్యాంపస్ నందు సాఫ్వేర్ ట్రైనింగ్‌లో నిరుద్యోగులకు డిగ్రీ చదువుతున్న యువకులకు మంచి ఉద్యోగ అవకాశాలున్న సైబర్ సెక్యూరిటీపై అవగాహన, సైబర్ ఇండస్ట్రీ నిపుణులైన జెబి షేక్ పరివేక్షణలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఉచిత ప్రవేశం నిరుద్యోగులు, డిగ్రీ విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయి, దీనివలన కలిగే ప్రయోజనాలు, తీర ప్రాంత ప్రజలకు ఎక్కడికో దూరంగా వెళ్లి నేర్చుకోవలసిన అవసరం లేకుండా ఎస్ఎస్ ఎడ్యుకేషన్ అకాడమీలో అవకాశాలు ఉన్నాయని డైరెక్టర్ దాసు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తాడిగిరిపాడు గ్రామ శివారులో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను ఎస్ఐ జానకి అమర వర్ధన్ ఆదివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.28200 నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత సిల్క్ ఉత్పత్తులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - వేటపాలెం

చేనేత రంగం అభివృద్ధి, సిల్క్ ఉత్పత్తుల ప్రోత్సాహం లక్ష్యంగా ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. స్థానిక దేశాయిపేట క్లస్టర్ కమ్యూనిటీ హాల్‌లో చేనేత సిల్క్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చేనేత రంగం మన సంప్రదాయం, మన సంస్కృతి ఆధునిక యుగంలో సిల్క్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని అన్నారు. అవగాహన లేకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారని అన్నారు. ఈ రంగంలో నైపుణ్యంతో పాటు ఆధునిక మార్కెట్ ధోరణులు అందిపుచ్చుకోవడం అవసరం అన్నారు. చేనేత కార్మికులు, క్లస్టర్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై సదస్సు విజయవంతం చేశారు. సిల్క్ ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతి అవకాశాలపై నిపుణులు విస్తృతంగా వివరించారు. కార్మికుల సమస్య విన్న ఆయన వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని కొండుబోట్లపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల 1992-93లో 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో వైభవంగా నిర్వహించారు. ఆనాటి గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అదే బ్యాచ్‌కు చెందిన మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల పరిసరాలతో పాటు క్రీడా ప్రాంగణంలో గడ్డి శుభ్రపర్చేందుకు గడ్డి కోత మిషన్ (గ్రాస్ హార్వెస్టర్) ను పూర్వ విద్యార్థులు హెచ్ఎం షేక్ మహబూబ్ సుభానికి అందజేశారు. పాఠశాల పూర్వ హెచ్ఎం పేరయ్య, ఉయ్యూరు వెంకటేశ్వరరావు, పున్నారావు, రామచంద్ర రావు, నిర్మలా కుమారి, పరమేశ్వరి, కర్లపాలెం ఎంపిడిఓ కార్యాలయ ఎఒ రజనీ, అరుణా కుమారిలను సన్మానించారు. కార్యక్రమంలో కొండుబోట్లపాలెం, నందిరాజుతోట, నల్లమోతువారిపాలెం, హైదర్‌పేట, సమ్మెట వారిపాలెం, పిన్నిబోయిన వారిపాలెం గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కెబి పాలెం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పంచాయతీ కార్యదర్శుల ఆందోళన

ప్రజాశక్తి - వేటపాలెం

బూత్ లెవెల్ ఆఫీసర్లుగా పంచాయతీ కార్యదర్శులను నియమించడం వివాదాస్పదమైంది. బిఎల్‌ఒ బాధ్యతలు విఆర్‌ఒల పరిధిలో ఉండగా చాలా చోట్ల విఆర్‌ఒలకు విధులు కేటాయించకుండానే పంచాయతీ కార్యదర్శులకు ఆర్డీఓ కార్యాలయాల ద్వారా విధులు కట్టబెట్టడంతో పంచాయతీ కార్యదర్శులు ఆందోళనకు దిగారు. స్థానికంగా డీఓ పరిధిలోని కార్యదర్శులు అందరినీ బిఎల్‌ఒలుగా నియమించడమేంటి? విఆర్‌ఒలను మాత్రం పక్కన పెట్టడం వెనుక ఉద్దేశ్యం ఏమిటి? అనే ప్రశ్నలు ఉద్యోగుల్లో చర్చనీయాంశం అయ్యాయి. రాబోయే కాలంలో ఎన్నికల పనులు, రిజిస్టర్ సవరణలు, ఓటర్ లిస్ట్ బాధ్యతలన్నీ కార్యదర్శులపై ఉండబోతున్నాయి. విఆర్‌ఒలలో కొందరికి మినహాయింపు ఇవ్వడంలో మతలబు తెలియడం లేదు. ఇది న్యాయం కాదని కార్యదర్శులు అంటున్నారు. నియోజకవర్గంలో చీరాల మండలంలో 25 పంచాయితీలు, వేటపాలెం మండలంలో 9పంచాయతీలు ఉన్నాయి. ఒక్కొక్కరుగా చీరాల ఆర్డీఓను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు కూడా తెలియజేశారు. ఈ అంశంపై పైస్థాయిలో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులను కోరేందుకు సిద్ధమయ్యారు. కొందరు కార్యదర్శులపై ఈపాటికే కఠిన చర్యలు ప్రారంభమయ్యాయి. చీరాల పరిధిలో ముగ్గురికి, వేటపాలెం మండలంలో ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చర్చిస్తున్నారు. ఉదయం పారిశుధ్యం, వీధి దీపాలు, నీటి సరఫరా, ఇంటి పన్నులు, అన్నీ డిపార్ట్మెంట్ సర్వే బాధ్యత కూడా పంచాయతీ కార్యదర్శి మాత్రమే బాధ్యత వహిస్తున్నారు. ఇప్పుడు బిఎల్‌ఒ డ్యూటీ అనేది ఎలక్షన్ కమిషన్ దృష్టిలో ఉంటుంది కనుక తప్పనిసరిగా బిఎల్‌ఓగా ఉంటే వేరొక పని చేయడానికి వీలుండదని, అన్ని పనులు చేస్తున్నా గతంలో ఇతర సిబ్బంది అందుబాటులో లేనప్పుడు మాత్రమే పంచాయితీ కార్యదర్శికి బిఎల్‌ఒ డ్యూటీ కేటాయించేవాళ్లు సచివాలయాల పరిధిలో విఆర్‌ఒలు, వెల్ఫేర్, సర్వేయర్లు, సెక్రటరీలు, వెటర్నరీ అసిస్టెంట్లు ఇలా లెక్కకు మించి సిబ్బంది ఉన్నప్పటికీ ప్రత్యేకంగా డిడిఓ సెక్రటరీలను కేటాయించడం పట్ల పెదవి విరుస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపైనే ఉంది.

ట్రై స్కూటీలు అందజేస్తున్న దృశ్యం

ట్రై స్కూటీలు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

దివ్యాంగులకు ఉచితంగా ట్రై స్కూటీలు అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో సోలార్ కార్పొరేషన్ సహకారంతో 35 మంది దివ్యాంగులకు ఉచితంగా ట్రై స్కూటీలు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 19వ వార్డు నాయకులు షేక్ రసూల్, స్టాండింగ్ కౌన్సిల్ షేక్ జబ్బర్, మొహిద్దీన్, ఎంఎసి డైరెక్టర్ మదర్ వలి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

రామ్మోహనరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

'చిలుమూరు'కు పురస్కారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదలంకకు చెందిన అధ్యాపకులు, వైసిపి టీచర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుమూరు రామ్మోహనరావుకు గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా ఆయన చేసిన సేవలకు జాషువా పురస్కారంతో సత్కరించినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ముట్లూరు వెంకయ్య, చిలకా సురేష్ బాబు, నరసింహారావు, ప్రకాశరావు, పుష్పాంజలి, అభిలాష ప్రసాద్ శిరీష పాల్గొన్నారు.

రైసు మిల్లర్ల యూనియన్ నూతన కార్యవర్గంతో గాంధీ

'రైస్ మిల్లర్స్' జిల్లా అధ్యక్షునిగా గాంధీ

ప్రజాశక్తి - బాపట్ల

రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇనగంటి గాంధీ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన రైస్ మిల్లర్స్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు ఎం నరసింహారావు, తట్టవర్తి గురువులు, నేరెళ్ల కాశీ, కార్యదర్శి కాసాని శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి దేవకి సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి పి సదానందరెడ్డి, కోశాధికారి నల్లమిల్లి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు గాంధీకి పలువురు రైస్ మిల్లర్లు, పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశం

ప్రజాశక్తి - వేటపాలెం

కాంగ్రెస్ జిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం బాపట్లలో జరగనుంది. రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న సూర్యకాళీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జెడి శీలం, షేక్ మస్తాన్‌వలి, పీసీసీ జనరల్ సెక్రటరీలు గంటా అంజిబాబు, కేశన రామకోటేశ్వరరావు, తాడికొండ వెంకటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు.

రవికుమార్‌ను అభినందిస్తున్న సోమరౌతు బ్రహ్మం

రవికుమార్ నియామకంపై హర్షం

ప్రజాశక్తి - వేమూరు

జనసేన కార్య నిర్వహణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షులు భవాని రవి కుమార్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఎన్నిక కావటం హర్షించతగ్గ విషయమని జనసేన జిల్లా నాయకులు సోమరౌతు బ్రహ్మం అన్నారు. పట్టణంలో విలేఖరులతో ఆదివారం మాట్లాడారు. కష్ట పడిన వారికి జనసేన తగిన గుర్తింపు ఇస్తుందని అన్నారు. అందుకు నిదర్శనమే రవి కుమార్ నియామకమని చెప్పారు. రానున్న రోజుల్లో మరెన్నో పదవులు పొందాలని అన్నారు. ఇటీవల అసెంబ్లీలో చిరంజీవిపై ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. చిరంజీవి జీవితంలో ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగారని అన్నారు. సినీ పరిశ్రమలో కష్టపడి మెగాస్టార్ అనిపించుకున్నారని అన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిఎస్పీ నాయకులు

బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - చీరాల

మాన్య శ్రీ కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా అక్టోబర్ 9న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిరసన ధర్నా నిర్వహించనున్నట్లు బిఎస్‌పి నాయకులు కాటి మార్కు తెలిపారు. స్థానిక గడియార స్తంభం సెంటర్లోని కాన్షీరామ్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్రలను తిప్పి కొట్టాలని కోరారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు దుడ్డు భాస్కరరావు, గొల్లెపాటి రవికుమార్, పాలు, కుంచాల పుల్లయ్య, వంశీ, చంటి మహేంద్ర, బుజిబాబు, డేవిడ్ లాజరు, సుధాకర్, అరుణ్, అర్జున్‌రావు, బాబురావు, శ్రీను పాల్గొన్నారు.

పిల్లల రక్షణను బాధ్యతగా గుర్తించండి

ఎస్పీ ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎస్పీ ఉమామహేశ్వర్

దసరా సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై ఖచ్చితంగా నిఘా ఉంచాలని తల్లిదండ్రులను హెచ్చరిస్తూ బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జిల్లాలో జరిగిన కొన్ని పరిణామాలను దష్టిలో ఉంచుకొని ఈ ప్రకటన విడుదల చేశారు. ఇటీవలి జిల్లాలో, ముఖ్యంగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా గ్రామాలు, పట్టణాల శివారులలో ఉన్న చెరువులు, గుంతలు నిండిపోగా, నదులు, వాగులు, కాలువలు ఉధతంగా ప్రవహిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సెలవుల కారణంగా సరదాగా కాలక్షేపం కోసం పిల్లలు, యువకులు చెరువులు, కాలువలు, వాగులు, నదీతీరాలు, సముద్రతీరాలకు వెళ్లి ఈతకు దిగే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అయితే ఇది ప్రమాదాలకు దారితీసే అవకాశం ఎక్కువని హెచ్చరించారు. ఉధతంగా ప్రవహించే ప్రవాహాలలో ఈతకు దిగటం వలన ప్రమాదాలకు లోనవుతున్నారన్నారు. అంతేకాకుండా సరైన లోతు తెలియని చెరువులలో, కుంటలలో దిగి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. బాపట్ల జిల్లా పరిధిలో విశాలమైన సముద్రతీరం ఉండటంతో ముఖ్యంగా సూర్యలంక, వాడరేవు, రామాపురం వంటి సముద్రతీరాలకు యాత్రికులు భారీగా తరలివస్తున్నారని తెలిపారు. వారిలో కొందరు యువకులు పోలీసుల హెచ్చరికలను లెక్కచేయకుండా లోతుగా సముద్రంలోకి వెళ్లి, అకస్మాత్తుగా వచ్చే పెద్ద అలల వల్ల ప్రమాదాల్లో పడుతున్న ఘటనలు చోటుచేసుకున్నాయని చెప్పారు. ఈ తరహా ఘటనలను నివారించేందుకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు.

నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నేతలు

సమానత్వ సమాజం కోసం పోరాడదాం..

జాషువాకు నివాళులర్పించిన కెవిపిఎస్ నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జాషువా కలలు గన్న సమానత్వ సమాజ నిర్మాణం కోసం పోరాడుదాం అని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా ఒంగోలులోని గుర్రం జాషువా కాలనీలో నివాళి కార్యక్రమం జరిగింది. ముందుగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురామ్, జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాఘవులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బి.రఘురామ్ మాట్లాడుతూ జాషువా కేవలం కవి కాదు, సమానత్వ యోధుడని పేర్కొన్నారు. ఆయన రచన గబ్బిలం' అణగారిన వర్గాల ఆత్మగౌరవ పోరాటానికి శాశ్వత ప్రేరణన్నారు. నేటికీ కులవివక్ష వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉందని, జాషువా కలలు కన్న సమానత్వ సమాజం నిర్మాణమే ఆయనకు ఇచ్చే నిజమైన ఘన నివాళి అని అన్నారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాఘవులు మాట్లాడుతూ జాషువా సాహిత్యం సమాజ మార్పు కోసం వెలుగొందుతున్న దీప్తి అని, కులవివక్ష నిర్మూలన, దళితుల గౌరవ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఆయన స్ఫూర్తితో ముందుకు రావాలి అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీటర్, సుబ్బారెడ్డి, కోటేశ్వరరావు, వెంకట్రావు, శ్రీను, ప్రేమలత, బుజ్జి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ స్థలం కాపాడుకునేందుకు

ఉద్యమం చేపట్టాలి..

వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలోని పాత మార్కెట్ భూమి (సర్వే నం.77, 0.83 ఎకరాలు)ను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు అప్పగించే పాలకుల నిర్ణయాన్ని వామపక్షాలు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ అంశంపై సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నాడు సుందరయ్య భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. నగర కార్యదర్శివర్గ సభ్యులు జీ.రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వామపక్షపార్టీలు, ప్రజాసంఘాలు పాలకవర్గ చర్యలను తీవ్రంగా దునుమాడారు.

పాలకులే దోపిడీకి తెరలేపుతున్నారు..

కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు లక్షల జనాభా, 132 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ఒంగోలు కార్పొరేషన్‌కు సంవత్సర ఆదాయం రూ.172 కోట్లకు పైగా ఉందన్నారు. అయినప్పటికీ పాలకులు ప్రజా ఆస్తులను రక్షించే బదులు ప్రైవేటు వ్యక్తుల దోపిడీకి తలవంచుతున్నారని మండిపడ్డారు. పాత మార్కెట్ ప్రభుత్వ స్థలంలో జి౦4 అంతస్థుల కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రైవేట్ బిడ్లు ఆహ్వానించడం ప్రజావ్యతిరేక చర్యఅని విమర్శించారు. పాలకవర్గమే ప్రైవేట్ వ్యక్తుల దోపిడీకి తెరలేపడం దుర్మార్గపు చర్యగా ఆరోపించారు.

ప్రజాసంక్షేమం పక్కన పెట్టి లాభాలే లక్ష్యం..

సిపిఐ నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని విడనాడి కూటమి పాలకులు భూముల లాగేసుకునే బాటలో పడ్డారని దుయ్యబట్టారు. ఈ ప్రక్రియను అడ్డుకోవడానికి ప్రజలు ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కొంగర నరసింహం మాట్లాడుతూ చరిత్ర కలిగిన మార్కెట్ స్థలాన్ని ప్రైవేటు వారికి అప్పగించడం సిగ్గుచేటు అని ధ్వజమెత్తారు.

ఇండియన్ లేబర్ పార్టీ నాయకులు దాసరి సుందరం మాట్లాడుతూ ప్రభుత్వానికి ధనదాహం పట్టిందన్నారు. సహజ వనరులు, భూములు అన్నీ ప్రైవేటు వ్యక్తుల కబంధ హస్తాల్లోకి వెళ్లేలా సంస్కరణలు చేపట్టారని విమర్శించారు.

ప్రజలకు మేలు చేసే విధానాలు అమలు చేయాలి..

జనవిజ్ఞాన వేదిక నాయకులు ఏవి. పుల్లారావు మాట్లాడుతూ ప్రజా ఆస్తులను పెట్టుబడిదారులకు తక్కువ ధరకే కట్టబెట్టే పాలకుల విధానాలను ప్రతిఘటించాలని సూచించారు.. నగరాభివద్ధి కమిటీ నాయకులు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ ఖాళీ స్థలాలను వాణిజ్య ప్రయోజనాలకన్నా ప్రజలకు ఉపయోగపడేలా చెరువుల అభివద్ధి, వాకింగ్ ట్రాక్‌లకు వినియోగించాలి అన్నారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.రాంబాబు, జి శేషయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల స్థలాలను కూడా కాజేయాలనే కుట్రలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ ఈ భూమిని కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టక తప్పదని పిలుపునిచ్చారు. సుపరిపాలన వేదిక నాయకులు సుంకర సాయిబాబు మాట్లాడుతూ ప్రైవేటు ప్రాజెక్టులు కాకుండా, నగరపాలక సంస్థ ఎల్ఐసి వంటి సంస్థల ద్వారా నిధులు సమీకరించి కాంప్లెక్స్ నిర్మించాలి అని సూచించారు.

మార్కెట్ స్థలం కాపాడుకునేందుకు ఉద్యమం

- సమావేశంలో తీర్మానం

మార్కెట్ స్థలం కాపాడు కునేందుకు నగర ప్రజలను కదిలించి ఐక్య ఉద్యమం చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు, నాయకులు బి.వి.రావు, కె.శ్రీనివాసరావు, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, పట్టణాభివద్ధి కమిటీ నాయకులు టీబిఎస్ రాజు, రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధులు, ఇండియన్ లేబర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాల విద్య'లో

నాణ్యతను మెరుగుపరిచేందుకు కృషి

సమగ్ర శిక్షాభియాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాగిరెడ్డి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పాఠశాల విద్య నాణ్యతను మెరుగు పరచాలనే ఉద్దేశ్యంతో సమగ్ర శిక్షా అభియాన్‌ను ప్రారంభించడం జరిగిందని, ప్రీ-స్కూల్, ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక, మాధ్యమిక, సీనియర్ సెకండరీ స్థాయిల నుండి పాఠశాల విద్యను సజావుగా మారే విధంగా పరిగణించడమే దీని లక్ష్యం అని బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు కో ఈర్టినేటర్ సి నాగిరెడ్డి తెలిపారు. జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు ద్వారా అమలవుతున్న పథకాల గురించి ఆయన 'ప్రజాశక్తి' ముఖాముఖికి వివరించారు. కేంద్ర మానవ వనరుల అభివద్ధి మంత్రిత్వ శాఖ పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం దీన్ని పర్యవేక్షిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సాంకేతికతను సమగ్రపరచడం ద్వారా అన్ని స్థాయిలలో విద్య నాణ్యతను మెరుగు పరచడంపై దష్టి పెట్టడమే లక్ష్యమన్నారు.

'మన బడి - మన భవిష్యత్తు' కార్యక్రమం

మనబడి - మన భవిష్యత్తు కార్యక్రమం అమలు ద్వారా పాఠశాల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, అన్ని పాఠశాలల్లో అభ్యాస ఫలితాలను మెరుగుపరచాలని, డ్రాపౌట్లును తగ్గించాలని ప్రభుత్వం కోరుకుంటుంది. పాఠశాలల్లో దశల వారీగా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రస్తుత మౌలిక సదుపాయాలను మిషన్ మోడ్‌లో మార్చడం ఉద్దేశం. మనబడి మనభవిష్యత్తు కార్యక్రమం కింద కింది జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టారు. నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, విద్యుదీకరణ, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, పాఠశాలలకు పెయింటింగ్, ఇంగ్లీష్ ల్యాబ్‌లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం.ఈ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలోని 25 మండలాల్లో మొత్తం 526 పాఠశాలలు, అంగన్‌వాడీలు, 15 కళాశాలలను భవనాల నిర్మాణం కోసం రూ 183 కోట్లు మంజూరు చేశారు.

విద్యార్థి కిట్‌లు..

అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యంగా ప్రభుత్వ నిర్వహణ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, వర్క్ బుక్స్, నోట్ బుక్స్, టెస్ట్ బుక్స్, బెల్టులు, ఒక జత బూట్లు, రెండు జతల సాక్స్ ,మూడు జతల యూనిఫాం క్లాత్‌తో కూడిన విద్యార్థుల కిట్‌లను ఇవ్వడం జరుగుతుంది. మొత్తంగా జిల్లా లోని విద్యార్థులకు 4,21,208 వస్తువుల కిట్‌లు ఇచ్చారు.తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు నిష్పత్తి పెంచడం.ప్రభుత్వ పాఠశాలల నుండి, ముఖ్యంగా సమాజంలోని ఆర్థికంగా బలహీనవర్గాల నుండి డ్రాపౌట్ రేటును తగ్గించడం.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను మెరుగుపరచడం. అభ్యాస కార్యకలాపాల్లో విద్యార్థుల భాగస్వామ్యాన్ని మెరుగుపరచడం తద్వారా పిల్లల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం చేస్తున్నారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల గౌరవాన్ని మెరుగు పరచడంలో సహాయపడుతుంది. మనబడి- నాడు నేడు లో పాఠశాల మౌలిక సదుపాయాల అభివద్ధిని పరిశీలించడానికి తల్లిదండ్రుల కమిటీలలో చురుకైన సభ్యులు కూడా కీలకంగా ఉన్నారు.పాఠశాల నిధుల సరైన పర్యవేక్షణ,వినియోగం కోసం తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

ముఖాముఖి

యూత్ అండ్ ఎకో క్లబ్‌లు

సమాజంలో పర్యావరణ అవగాహనను సష్టించడంలో యూత్ అండ్ ఎకో క్లబ్ లు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. ఈక్లబ్‌లు విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడేలా చేస్తున్నాయి.పాఠశాల ప్రాంగణంలో, ఇళ్ల వద్ద మొక్కలు నాటే కార్యక్రమం. పరిసరాలు పచ్చగా, పరిశుభ్రతగా ఉంచుకునేలా ప్రోత్సహించడం. నీటి వినియోగాన్ని తగ్గించడం గురించి విద్యార్థులకు అవగాహన శిక్షణ అందించడం జరుగుతుంది

కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు

తల్లిదండ్రులు లేని పిల్లలు, ఒంటరి తల్లిదండ్రుల పిల్లలు, బడి బయట పిల్లలు, మైనార్టీ, నిర్లక్ష్యం చేయబడిన పిల్లలకు విద్యను అందించడానికి కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీలు) ఏర్పాటు చేశారు. జిల్లాలో చినగంజాం, చీరాల, సంతమాగులూరు, బల్లికురవల్లో నాలుగు కస్తూరిబా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ తరగతికి 40 చొప్పున మొత్తంగా 1,046 మంది చదువుకుంటున్నారు. చీరాలలో ఒక మోడల్ స్కూల్ ఉంది.ఇందులో 98 మంది విద్యను అభ్యసిస్తున్నారు. విద్యాపరంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు ఉన్నత ప్రాథమిక స్థాయి వరకు విద్యను అందించడానికి బాలిక విద్యాలయాలు ప్రారంభించారు. ఈ విద్యాలయాల్లో పిల్లలకు వత్తి విద్య కోర్సులు నేర్పిస్తున్నారు. దీనిలో భాగంగా వ్యవసాయం, దుస్తులు, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో శిక్షణ అందించడం జరుగుతుంది. దీనివలన భవిష్యత్తులో వారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయి.

సమ్మిళిత విద్యా విధానం

సమ్మిళిత విద్యా విధానం ద్వారా ప్రతి విద్యార్థికి వారి సామర్థ్యాలను బట్టి నాణ్యమైన విద్య అందించడానికి కషి జరుగుతుంది.ఈ విద్యా విధానం ప్రీ స్కూల్ నర్సరీ నుండి 12వ తరగతి వరకు ఉంది. అందరికీ సమాన అవకాశాలపై బలమైన ప్రాధాన్యత ఇస్తుంది. సమ్మిళిత విద్య కింద ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలందరికీ ఉచిత విద్య అందించడం జరుగుతుంది. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలందరికి తగిన శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను చేర్చుకోవడానికి పాఠశాల సహాయకులు , రిసోర్స్ పర్సన్ లు ఇంటి ఇంటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. భవిత కేంద్రాల ద్వారా శ్రవణ శిక్షణ, దష్టి ఉద్దీపన ధోరణి, చలన శీలత, బ్రెయిలీ నైపుణ్యాలు, ఫిజియోథెరపీ వంటివి అందిస్తున్నారు.